తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 217 | శనివారం 28–12–2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in




# మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళి

## సీఎం వెంట పీసీసీ, మంత్రి దామోదర రాజనర్సింహ, తెలంగాణ ఎంపీలు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ అనారోగ్య కారణాలతో 26 డిసెంబర్ రాత్రి తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. సీఎంతోపాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహా, తెలంగాణ ఎంపీలు ఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్ వద్ద ఉన్న మన్మోహన్ సింగ్ నివాసానికి చేరుకున్నారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాగా.. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మన్మోహన్ సింగ్.. నిన్న ఇంట్లో అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. రాత్రి 8:06 గంటలకు ఎయిమ్స్‌లోని మెడికల్ ఎమర్జెన్సీకి తరలించారు. రాత్రి 9:51 గంటలకు మన్మోహన్ కన్నుమూసినట్టు ఎయిమ్స్ ప్రకటించింది. 1932 సెప్టెంబర్ 26న అవిభక్త భారత్‌లోని పంజాబ్ రాష్ట్రంలో జన్మించిన మన్మోహన్ సింగ్.. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా సేవలందించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన ప్రధానుల్లో మన్మోహన్ ఒకరు.. 1991 నుంచి 1996 వరకు పీవీ కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా సేవలందించారు.. ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా పేరుగాంచారు.. 1991 అక్టోబర్‌లో తొలిసారిగా రాజ్యసభలో అడుగుపెట్టారు.. ఐదు సార్లు అసోం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా, వాణిజ్య మంత్రిత్వశాఖ సలహాదారుగా, ఆర్థికశాఖ ప్రధాన సలహాదారుగా, ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శిగా, ప్రణాళిక సంఘం ఛైర్మన్‌గా, ఆర్బీఐ గవర్నర్‌గా, ప్రధాని సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ ఛైర్మన్ వంటి బాధ్యతలు నిర్వర్తించారు.



# రాష్ట్ర ప్రజాప్రతి నిధులకు టీటీడీ శుభవార్త..

- వారానికి రెండు సార్లు నేతల సిఫార్సు లేఖల అనుమతి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు గుడ్‌న్యూస్ చెప్పింది. వారానికి రెండు సార్లు తెలంగాణ నేతల సిఫార్సు లేఖలు అనుమతించాలని నిర్ణయం తీసుకుంది. శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు తీసుకోవడం లేదు? అనే ప్రశ్నపై టీటీడీ ఈవో శ్యామల రావు గతంలో స్పందించారు. శ్రీవారి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తున్నామని స్పష్టత ఇచ్చారు. తెలంగాణ నుంచి సిఫార్సు లేఖలు తీసుకువస్తే.. చెల్లుబాటు కావని స్పష్టమైంది. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానంలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులను చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పలు ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చాయి.దీంతో తాజాగా టీటీడీ బోర్డు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల అంశాన్ని పునఃపరిశీలించింది. మిత్ర, సాటి తెలుగు రాష్ట్రంపై ఇలాంటి నిర్ణయం సరికాదనుకుంది. బోర్డులోని మెజారిటీ సభ్యులు కూడా సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. దీంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు వారానికి రెండు సార్లు అనుమతిస్తారు.

# ఎస్సై, లేడీ కానిస్టేబుల్ డెత్ మిస్టరీ.

- మిస్టరీగా భిక్కనురు ఎస్.ఐ. సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, ఆపరేటర్ నిఖిల్ మృతి కేసు..
- కీలకంగా మారిన ముగ్గురి కాల్ డేటా, వాట్స్ అప్ చాటింగ్..
- వారం రోజులుగా ముగ్గురు గంటల తరబడి ఫోన్లు మాట్లాడుకుని, వాట్స్ అప్ చాటింగ్ గుర్తింపు..
- ముగ్గురు మృతి కేసు విచారణకు ప్రత్యేక బృందాల ఏర్పాటు..



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

కామారెడ్డి జిల్లాలో భిక్కనూరు ఎస్.ఐ. సాయికుమార్, కానిస్టేబుల్ శృతి, ఆపరేటర్ నిఖిల్ మృతి కేసు మిస్టరీగా మారింది. వీరి ముగ్గురి కాల్ డేటా, వాట్స్ అప్ చాటింగ్ లు కీలకంగా మారాయి. వారం రోజులుగా ముగ్గురు గంటల తరబడి ఫోన్లు మాట్లాడుకుని, వాట్స్ అప్ చాటింగ్ చేసుకున్నారని పోలీసులు గుర్తించారు. ముగ్గురు మృతి కేసు విచారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు అధికారులు. సీసీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. ముగ్గురు కలిసి ఒకే కారులో అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువుకు వచ్చినట్లు గుర్తించారు. దర్యాప్తులో పోస్ట్ మార్టం నివేదిక కీలకం కానుంది. పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా పోలీసులు విచారణ ప్రారంభించనున్నారు. కామారెడ్డి జిల్లా భీక్కునూర్ ఎస్సై సాయికుమార్, బీబీ పెట్ కానిస్టేబుల్ శృతి, సొసైటీ ఆపరేటర్ నిఖిల్ మృత దేహాలు లభ్యమయ్యాయి. అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువు నుండి ముగ్గురు మృతదేహాలను పోలీసులు


మిగతా 2లో



# కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి బీఆర్ఎస్ పోటీ డౌటే!..

- స్వతంత్రులకే మద్దతిచ్చే చాన్స్
- కోట్లు కుమ్మరించినా 'నల్లగొండ'లో గెలువలే
- ఇండిపెండెంట్లకు మద్దతివ్వడమే బెస్ట్..?

మిగతా 2లో



# రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి సిద్ధం..!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

వివిధ దశల్లో ఉన్న వాటిని పూర్తి చేయాలని నిర్ణయంఇందిరమ్మ ఇళ్లతోపాటే ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాట్లు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీతో పాటు రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో గత ప్రభుత్వం మొత్తం 2,30,320 రెండు పడక గదుల ఇళ్లకు టెండర్లు పిలిచి పనులను ప్రారంభించింది. వీటిలో 1,60,705 ఇళ్లను పూర్తి చేసి 1,36,116 మందికి పట్టాలను పంపిణీ చేసింది. మరో 36,538 ఇళ్ల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. మిగతా 33,077 పునాది, పిల్లర్లు, శ్లాబ్ దశల్లో ఉన్నాయి. చాలా చోట్ల తమకు బిల్లులు రాలేదని గుత్తేదారులు పనులను మధ్యలోనే ఆపేశారు. వారికి నోటీసులు ఇవ్వడానికి సర్కారు సిద్ధమవుతోంది. పెండింగ్‌లో ఉన్న మిగతా వాటిని కూడా పాత ధరల ప్రకారం పూర్తి చేస్తే ఆ గుత్తేదారులకు బిల్లులు కూడా ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. కొన్నిచోట్ల నిర్మాణం పూర్తయినా మౌలిక వసతులు కల్పించలేదు. ఇలాంటి ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.182 కోట్లను కేటాయించింది. 94,204 ఇళ్లకు పట్టాలు...: ఇప్పటికే పూర్తయిన వాటితో పాటు వివిధ దశల్లో ఉన్నవి పూర్తిచేసి మొత్తం 94,204 ఇళ్లకు పట్టాలు అందించాల్సి ఉండగా వాటిని కూడా ఇందిరమ్మ ఇళ్ల సర్వే ద్వారా ఎంపిక చేసినవారికే కేటాయించే అవకాశాలు

మిగతా 2లో

# అలా చేయకుంటే స్థానిక ఎన్నికలు జరగనివ్వం..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుంటే తాము ఎన్నికలు జరగనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడంపై ఆలోచన చేయాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దాదాపు 40కిపైగా బీసీ కుల సంఘాలకు చెందిన నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ కవితతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలు, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, కానీ ప్రధాన డిమాండ్‌గా ఉన్న బీసీల రిజర్వేషన్ పెంపుపై స్పష్టత

మిగతా 2లో



# అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు సమయం

మిగతా 2లో

# ఫార్ములా-ఈ రేసు కేసు విచారణ వాయిదా..



- ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో కౌంటర్ దాఖలు చేసిన ఏసీబీ..
- కేటీఆర్ నాట్ టు అరెస్ట్‌ను ఎత్తివేయాలని పిటిషన్ వేసిన ఏసీబీ..
- ఏసీబీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశం..
- తదుపరి విచారణ ఈనెల 31కి వాయిదా..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారించింది. హైకోర్టు ఆదేశాలపై ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్ అరెస్టుపై జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ కోరింది. కేటీఆర్‌ను అరెస్ట్ చేయరాదన్న ఆదేశాలను ఈ నెల 31 వరకు పొడిగించింది. అనంతరం విచారణను కోర్టు ఈ నెల 31కి వాయిదా వేసింది. ఈ నెల 30వ తేదీ వరకు కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని వారం రోజుల క్రితం హైకోర్టు ఏసీబీని ఆదేశించిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టులో

మిగతా 2లో

# ఫార్ములా ఈ రేసు కేసు విచారణ వాయిదా..



**మొదటి పేజీ తరువాయి**

క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటీషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం డిసెంబర్ 30 వరకు అరెస్ట్ చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. విధానం ప్రకారం నోటీసులు ఇచ్చి విచారణ జరపాలని సూచించింది. ఇప్పటికే దానకిషోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉన్న దృష్ట్యా ఏ1 కేటీఆర్, ఏ2 అరవింద్ కుమార్, ఏ3 బీఎల్ఎన్ రెడ్డిలకు ఏసీబీ ఇంకా నోటీసులు జారీ చేయలేదని సమాచారం. అయితే వారందరికీ నోటీసులు జారీ చేసేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అధికారులు సిద్ధం చేశారు.

# అలా చేయకుంటే స్థానిక ఎన్నికలు జరగనివ్వం..



**మొదటి పేజీ తరువాయి**

లేకుండా ఎన్నికలు జరిపేందుకు వీలు లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు గుర్తు చేశారు. రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలు జరగనివ్వబోమని తేల్చిచెప్పారు. రాబోయే రోజుల్లో చేపట్టే జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతామన్నారు. అలాగే జనవరి 3న నిర్వహించబోయే సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మరోవైపు బీసీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ హాయంలో ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంపై ధ్వజమెత్తారు. ఈ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**మొదటి పేజీ తరువాయి**

కోరారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను సోమవారానికి (డిసెంబరు 30) వాయిదా వేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి న్యాయస్థానం విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ నేటితో ముగిసింది. దీంతో నేడు ఆయన వర్చువల్‌గా న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. మరోవైపు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో విచారణనూ నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 10వ తేదీన చేపట్టనున్నట్లు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్‌పైనా విచారణ ఆ రోజే జరగనుంది.




# కృష్ణా నదిపై ఏపీ వాదనలు అభ్యంతరకరం: తెలంగాణ

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

కృష్ణా ట్రిబ్యునల్ ముందు ఆంధ్రప్రదేశ్ వాదనలపై తీవ్రంగా అభ్యంతరం తెలిపింది తెలంగాణ ప్రభుత్వం. ఈనెల 6న కృష్ణా ట్రిబ్యునల్ ముందు ఏపీ ప్రభుత్వం వినిపించిన వాదనలపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ శుక్రవారం కౌంటర్‌ను దాఖలు చేసింది. ఏపీ ప్రభుత్వం కృష్ణా జిల్లాలను అదనంగా వినియోగించుకోవడానికి కొత్త తీర్పులో జాప్యం కావడానికి ఉద్దేశ పూర్వకంగా వాయిదాలు అడుగుతుందని, తప్పుడు వాదనలను వినిపిస్తుందని తెలంగాణ నీటి పారుదల శాఖ పేర్కొంది. కృష్ణా నది ఏపీ పరివాహక ప్రాంతం తక్కువగా ఉన్నప్పటికీ అధికంగా నీటిని వాడుకుంటుందని తెలంగాణ తెలిపింది. పరివాహక ప్రాంతం ఆధారంగా కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతుంది. నెట్టెంపాడు, ఏఎంఆర్‌పీ నుంచి నీటిని తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. కృష్ణా ట్రిబ్యునల్ ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌పై ఏపీ తరపు సాక్షిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియ ముగిసింది. తెలంగాణ వేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్ (ఐఏ) పై కౌంటర్ దాఖలు చేయాడానికి ఏపీకి రెండు వారాల గడువు ఇచ్చింది. జనవరి 16, 17 తేదీల్లో తదుపరి విచారణ జరగనుంది.

# మీసేవ పేరుతో ఫేక్ వెబ్‌సైట్..

దేశంలో గత కొంత కాలంగా సైబర్ మోసాలు భారీగా పెరిగిపోయినా విషయం తెలిసిందే. సైబర్ నేరగాళ్లు రోజుకో అవతారమెత్తి దోపిడీకి పాల్పడుతున్నారు. నకిలీ వెబ్‌సైట్లతో నేరగాళ్లు ప్రజలను మోసం చేసి డబ్బు దోచేస్తున్నారు. ఇదిలా ఉంటే.. కొందరు కేటుగాళ్లు తెలంగాణ ప్రభుత్వ మీసేవ పేరుతో ఫేక్ వెబ్‌సైట్ క్రియేట్ చేసి మోసాలకు పాల్పడ్డ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మీ సేవ వెబ్‌సైట్ meeseva.telangana.gov.in కాగా meesevatelangana.in పేరుతో నకిలీది సృష్టించారు. ఇందులో కొత్తగా మీసేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామంటూ హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ పేరుతో నకిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో చాలా మంది ఆశావహులు అది నిజమని నమ్మి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ మీ సేవ ఆపరేటర్ల సమాఖ్య కలెక్టర్‌తో పాటు ఐటీ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. ఐటీ శాఖతో పాటు సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నకిలీ వెబ్‌సైట్ బ్లాక్ చేసి దర్యాప్తును ప్రారంభించారు. అయితే ఇలాంటి ఫేక్ వెబ్‌సైట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు మనీ ట్రాన్సక్షన్స్ చేసే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# కరీంనగర్ పట్టభద్రుల స్థానం నుంచి బీఆర్ఎస్ పోటీ డౌటే!.

- స్వతంత్రులకే మద్దతిచ్చే చాన్స్
- కోట్లు కుమ్మరించినా 'నల్లగొండ'లో గెలువలే
- ఇండిపెండెంట్లకు మద్దతివ్వడమే బెస్ట్..?
- కారు పార్టీ లీడర్ల అంతర్మథనం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



త్వరలో జరగబోయే కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పోటీ చేసే అవకాశం లేదని తెలుస్తోంది. వరుస పరాభవాలతో పరేషాన్ లో ఉన్న గులాబీ పార్టీ ఈ సారికి ఎవరైనా ఇండిపెండెంట్ కు మద్దతు ఇవ్వాలనే యోచనలో ఉన్నట్టు సమాచారం. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడిన సమయంలో వెన్నంటి ఉన్న జిల్లాలను ఈ సారి విస్మరిస్తుండటం గమనార్హం. ఇటీవల జరిగిన నల్లగొండ-ఖమ్మం -వరంగల్ పట్టభద్రుల స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగి ఏనుగుల రాకేశ్ రెడ్డిని బరిలోకి దించింది. ఈ సందర్భంగా భారీగా డబ్బులు ఖర్చు చేసింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో నిలిచారు. కాంగ్రెస్ తరఫున తీన్మార్ మల్లన్న బరిలోకి దిగారు. తీన్మార్ మల్లన్నపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో ప్రచారం చేయించారు. అయినా తీన్మార్ మల్లన్నకే ఓటర్లు పట్టం కట్టారు. దిలా ఉండగా గతంలో జరిగిన కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గ్రూప్ -1 ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ ను బీఆర్ఎస్ రంగంలోకి దించింది. కాంగ్రెస్ తరఫున జీవన్ రెడ్డి బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో పట్టభద్రులు ప్రశ్నించే గొంతుక నినాదంతో బరిలోకి దిగిన జీవన్ రెడ్డినే గెలిపించారు. ఈ అనుభవాలన్నీ లెక్కలు వేసుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుత పరిస్థితుల్లో పోటీ చేయకుండా ఉండటమే మంచిదనే అభిప్రాయానికి వచ్చిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థి ఎవరనే చర్చకూడా సాగడం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచినందున ఇక్కడ పోటీ చేయకుండా ఉంటే బాగుండదనే మరో చర్చకూడా నడుస్తోందని సమాచారం. ఏది ఏమైనా స్వతంత్రులకే మద్దతిచ్చేందుకే పార్టీ నాయకత్వం మొగ్గు చూపుతోందని తెలుస్తోంది.



# ఎస్సై, లేడీ కానిస్టేబుల్ డెత్ మిస్టరీ.

**మొదటి పేజీ తరువాయి**

వెలికితీశారు. నిన్న మధ్యాహ్నం నుండి ముగ్గురు మిస్సింగ్ పై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం అర్ధరాత్రి ఇద్దరి మృతదేహాలను పోలీసుల వెలికితీయగా.. గురువారం ఎస్సై సాయి కుమార్ మృతదేహం గుర్తించారు.

ఈ ఘటనపై కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ.. అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ముగ్గురు మృతదేహాలు లభ్యం అయ్యాయని తెలిపారు. సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారం మిస్సయిన ముగ్గురు ఆచూకీ గుర్తించామని ఎస్పీ సింధు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చేవరకూ ఆత్మహత్యకు గల కారణాలు చెప్పలేమన్నారు. ఎస్సై జేబులోనే సెల్ ఫోన్ గుర్తించామని అన్నారు. విచారణ కొనసాగుతోంది.. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ సింధు తెలిపారు.



# గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలకు లైన్‌క్లియర్

- పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు
- పిటిషన్లు ఆలస్యంగా వేయడాన్ని తప్పుబట్టిన ధర్మాసనం
- ప్రిలిమ్స్ ఫలితాలు వచ్చాక జీవోను సవాలు చేయడం సరికాదని వ్యాఖ్య....మొత్తం ఏడు పిటిషన్లు కొట్టివేత
- తీర్పు వెలువరించిన జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల వెల్లడికి లైన్‌క్లియర్ అయ్యింది. రాష్ట్రంలో కీలక పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం చేపట్టిన పరీక్షల నిర్వహణలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. రిజర్వేషన్ల అంశం తేలేవరకు మెయిన్స్ పరీక్షల ఫలితాలు ప్రకటించవద్దని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్‌పీఎస్సీ)ను ఆదేశించాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చింది. పిటిషన్ల దాఖలులో ఆలస్యాన్ని ప్రస్తావించిన ధర్మాసనం.. ఫిబ్రవరిలో తాజా నోటిఫికేషన్ ఇస్తే ఇందుకు సంబంధించిన జీవో 29 ప్రతి అప్‌లోడ్ కాలేదన్న కారణంతో ఆలస్యంగా పిటిషన్లు దాఖలు చేయడాన్ని తప్పుబట్టింది.

ప్రిలిమ్స్ ఫలితాలు వెల్లడించిన తర్వాత జీవో ను సవాల్ చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 226 ప్రకారం తమకున్న విస్తృతాధికారాల మేరకు ఉత్తర్వులు వెలువరుస్తామని స్పష్టం చేసింది. రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం గురువారం తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి.గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2022లో ప్రభుత్వం జీవో 55 జారీ చేసింది. రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిది. అయితే పేపర్ లీకేజీ కారణంగా ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కాగా, ఆ తర్వాత ప్రభుత్వం పోస్టుల సంఖ్య పెంచుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి నోటిఫికేషన్ ఇస్తూ జీవో 29 జారీ చేసింది. ఫిబ్రవరిలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం టీజీఎస్‌పీఎస్సీ రూల్ ఆఫ్ లాను పాటించేలా, ప్రిలిమ్స్, మెయిన్స్.. అన్నింటా రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ నల్లగొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన పోగుల రాంబాబు సహా మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2019లో జారీ చేసిన జీఓ 96ను కూడా సవాల్ చేశారు. ఇలా మొత్తం ఏడు పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది.

**వాదనలు సాగాయిలా...**

పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'మెయిన్స్‌కు ఎంపిక చేసిన 1:50లో కూడా సమాంతర రిజర్వేషన్లు పాటించేలా ఆదేశాలు జారీ చేయాలి. ఇందిరా సహానీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేయడం లేదు. 1:50 మేరకు రిజర్వేషన్లు పాటిస్తూ అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా, అంతకు మించి మెయిన్స్‌కు ఎంపిక చేశారు. రీ నోటిఫికేషన్ ఇస్తూ జారీ చేసిన జీవో 29 కూడా చట్టవిరుద్ధం.

రిజర్వేషన్ల అంశం తేలేదాకా మెయిన్స్ ఫలితాలు వెల్లడించకుండా టీజీఎస్‌పీఎస్సీకి ఆదేశాలు జారీ చేయాలి..'అని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్షలు రద్దయ్యాయి. ఈ సారి ప్రిలిమ్స్, మెయిన్స్ ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాం. పిటిషన్లను అనుమతించవద్దు. మెయిన్స్ ఫలితాల వెల్లడిని అడ్డుకోవద్దు..'అని కోరారు. ఈ నెల 17న తుది వాదనలు విన్న ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది.

**జీవో 55..**

గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2022, ఏప్రిల్ 25న గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 503 పోస్టులు భర్తీ చేసేందుకు జీవో 55ను జారీ చేసింది. పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని తెలిపింది. తెలంగాణ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 22, 22ఏ నిబంధనల ప్రకారం రిజర్వుడు కేటగిరీ, జెండర్, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులు, స్పోర్ట్స్ రిజర్వేషన్లు పాటించాలని స్పష్టం చేసింది. ఓపెన్ మెరిట్‌లో చోటు సంపాదించిన రిజర్వ్‌డ్ అభ్యర్థులు ఓపెన్ మెరిట్‌తో పాటు సంబంధిత రిజర్వుడు కేటగిరీ పోస్టులకు కూడా పోటీ పడవచ్చని తెలిపింది.

**జీవో 29...**

ప్రస్తుత ప్రభుత్వం 2024, ఫిబ్రవరి 19న మరో నోటిఫికేషన్ జారీ చేసింది. పోస్టుల సంఖ్యను 503 నుంచి 563కు పెంచుతూ సుప్రీంకోర్టు తీర్పు మేరకు జీవో 29ని జారీ చేసింది. రిజర్వుడు కేటగిరీతో సంబంధం లేకుండా పోస్టుల సంఖ్య మేరకు 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఇందులో ఒకవేళ రిజర్వుడు కేటగిరీకి అనుగుణంగా ఆ వర్గాల అభ్యర్థులు లేకుంటే.. ఆ కేటగిరీలోని తదుపరి మెరిట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపింది. 1:50 మేరకు రిజర్వుడ్ అభ్యర్థుల సంఖ్య ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. మెయిన్స్‌కు ఎంపికైన రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులంతా ఓపెన్ కేటగిరీ పోస్టులకు పోటీ పడవచ్చు.



# రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి సిద్ధం..!

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా జీహెచ్ఎంసీ పరిధిలో 98,215 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా 69,771 పూర్తయ్యాయి. మొత్తం 65,083 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టాలు ఇచ్చారు. జీహెచ్ఎంసీని మినహాయిస్తే రాష్ట్రంలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 12,658 ఇళ్లకు అనుమతులు రాగా 11,125 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 10,806 మందికి పట్టాలు అందించారు. నిజామాబాద్ జిల్లాలో 12,553 ఇళ్లకు అనుమతులు రాగా 7,075 ఇళ్లు పూర్తయ్యాయి. ఈ జిల్లాలో మాత్రం 1,055 మంది లబ్ధిదారులను గుర్తించారు. ఇలా పలు జిల్లాల్లో వివిధ దశల్లో ఉన్న ఇళ్లను గుర్తించి లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక సమయంలోనే ఈ ఇళ్లకు అర్హులను గుర్తించి పట్టాలు ఇవ్వనుంది.



# గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ కార్యాలయం ప్రారంభం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఇమ్మిగ్రేషన్ అంతర్జాతీయ చట్టపరమైన విషయాలలో ప్రత్యేకత కలిగిన ప్రముఖ న్యాయ సంస్థ గెహిస్ ఇమ్మిగ్రేషన్ ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్, హైదరాబాద్, నాలెడ్జ్ పార్క్‌లో కొత్త బ్రాంచ్ ప్రారంభం అయింది. దీనిని తెలంగాణ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్, సుధా జైన్ సోషలైట్, నరేష్ ఎం గెహి ముఖ్యతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంక్లిష్ట ఇమ్మిగ్రేషన్, అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను ప్రతిబింబిస్తూ చేసే వ్యక్తులు, కుటుంబాలు వ్యాపారాలకు వ్యక్తిగతీకరించిన, సమర్థవంతమైన, అత్యాధునిక న్యాయ సేవలను అందించడంలో తమ సంస్థ ముందుంటుందని నిర్వాహకులు అన్నారు. ఈ సందర్భంగా గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ మేనేజింగ్ పార్టనర్ నరేష్ ఎం గెహి మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య ఇమ్మిగ్రేషన్ సంబంధిత వ్యవహారాలు, ఇబ్బందులు తొలగించి కుటుంబం, బిజినెస్, వ్యక్తిగతంగా వివిధ రకాల వీసాల సమస్యల పరిష్కారంలో గేహిస్ ఇమ్మిగ్రేషన్ ప్రత్యేకం అన్నారు.భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య అంతరాన్ని తగ్గించే మా ప్రయాణం గేహిస్ ఇమ్మిగ్రేషన్‌కు ముఖ్యమైన మైలురాయి, ఎదుగుదల ఆవిష్కరణలు, అవకాశాలు అమెరికాకు అందించడంలో భారతదేశం ఎపుడు అగ్రగామిగా ఉంటుందన్నారు. చదువు, బిజినెస్, గ్రీన్ కార్డ్, వ్యవస్థల బదిలీ, స్పోర్ట్స్ రిలేటెడ్‌కు సంబధిత హెచ్ 1బీ, పలు రకాల వీసాలు భారత్ అమెరికా దేశాలమధ్య భవిషత్తు, పురోగతికి మంచి తోడ్పాటునిస్తాయని తెలిపారు. ఇమ్మిగ్రేషన్, అంతర్జాతీయ న్యాయ సేవల కోసం డిమాండ్ పెరుగుతున్నందున, తాము తమ ఖాతాదారులకు అందుబాటులో ఉండటానికి మరిన్ని ప్రదేశాలలో సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని ఈ సందర్భంగా నరేష్ ఎం గెహి పేర్కొన్నారు.






# న్యూ ఇయర్ గ్రీటింగ్స్‌తో భారీ సైబర్ దోపిడీకి ప్లాన్.. క్లిక్ చేస్తే పైసలు మాయం



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

న్యూ ఇయర్ గ్రీటింగ్స్ పేరుతో ఉన్నదంతా దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు ప్లాన్ వేశారని టీజీఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. 'ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నావారి చేతికి చిక్కి ఖాతాలు ఖాళీ చేసుకోవడమే కాదు. ఫోన్లలో ఉన్న వ్యక్తిగత సమాచారం అంతా పోగొట్టుకోవాల్సి వస్తుంది. న్యూ ఇయర్ విషెస్ ఫొటోలు, మెసేజ్ లను మీ పేరుతో సహా తయారు చేసుకొని ఇతరులకు పంపవచ్చని, ఇందుకోసం ఈ కింది లింకుపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేస్తే చాలని స్మార్ట్ ఫోన్లకు సందేశాలు పంపిస్తున్నారు. పొరపాటున వాటిపై క్లిక్ చేశారంటే తిప్పలు తప్పవు. ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైల్స్ రూపంలో పంపే ఈ గూఢచర్య అప్లికేషన్ ఒకసారి ఫోన్లోకి జొరబడిందంటే అందులోని సమస్త సమాచారం నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లిపోతుంది. బ్యాంకు అకౌంటివివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్ట్ నంబర్లు, ఇతర ఫైల్స్ అన్నీ తీసేసుకుంటారు. కాబట్టి నూతన సం వత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# నాచారంలో యువతి ఆత్మహత్య..
# నా చావుకు కారణం వారే అంటూ సెల్ఫీ వీడియో..

- నాచారంలో యువతి ఆత్మహత్య ఆలస్యంగా వెలుగులోకి..
- దీప్తి బుధవారం రాత్రి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య..
- నాచారం హెచ్ఎంటి నగర్ సరస్వతి కాలనీలో నివాసం..
- రెండు సంవత్సరాలుగా తండ్రితో దూరంగా తల్లితో కలిసి నివాసం..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

నాచారంలో యువతి ఆత్మహత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీప్తి అనే యువతి బుధవారం రాత్రి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకుంది. నాచారం హెచ్ఎంటి నగర్ సరస్వతి కాలనీలో తన తల్లితో నివాసం ఉంటుంది. దీప్తి తార్నాక ఐఐసిటీలో పరిశోధక విద్యార్థినీ. దీప్తి తండ్రి సంగీతరావు. తండ్రితో వేరుగా దీప్తి రెండు సంవత్సరాల నుండి తన తల్లితో కలిసి వేరుగా ఉంటుంది. ఐజీ ఆఫీసులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బిల్ల అనిల్ అనే వ్యక్తి తన భార్య కోసం ఐఐసిటిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కోసం, దీప్తి తండ్రి సంగీత రావుకు రూ.15 లక్షలు డబ్బులు ఇచ్చినట్లు సమాచారం. దీప్తి తండ్రి సంగీతరావు ఉద్యోగం కోసం అనిల్ వద్ద డబ్బు తీసుకున్న విషయం దీప్తికి తెలియదు.బిల్లా అనిల్‌కు దీప్తి తండ్రి సంగీత రావు ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో సంగీత రావును డబ్బులు తిరిగి ఇవ్వాలని బిల్లా అనిల్ కోరాడు. డబ్బుల విషయంలో సంగీతరావు సైలెంట్ గా ఉండటంతో సీన్ లోకి అనిల్ భార్య ఎంట్రీ ఇచ్చింది. సంగీత రావు, దీప్తి పైన అనిల్, భార్య అనిత నాచారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఫిర్యాదు చేసేంత వరకు దీప్తికి డబ్బుల విషయం తెలియదు. అందులో తన ప్రమేయం లేదని, తన తండ్రితో కలిసి ఉండటం లేదని చెప్పినా అనిల్, భార్య అనిత వినలేదు. డబ్బుల విషయంలో దీప్తిని వేధించారు. అనిల్ భార్య అనిత దీప్తిపై ఫిర్యాదుపై దీప్తి తీవ్ర మనస్థాపానికి గురైంది. తన తల్లితో చెప్పుకోలేక మౌనం వహించిన దీప్తి తనకు జరిగిన అవమానంతో బుధవారం రాత్రి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తన గది నుంచి ఎంతకూ బయటకు రాకపోవడంతో దీప్తి తల్లి గది తలుపు తీసి చూడ దీప్తి మృతి చెంది ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీప్తి ఇంటికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. అనిల్, భార్య అనిత వేధింపుల వల్లనే చనిపోయిందని దీప్తి తల్లి ఆరోపిస్తుంది. వారి వల్లే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని కన్నీరుమున్నీరుగా విలపించింది. గదిలో దీప్తి సెల్ఫీ వీడియోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీప్తి తండ్రి సంగీత రావు, అనిల్, భార్య అనితలను అదుపులో తీసుకుని విచారించనున్నారు.



# రూ.9.29తో పోషకాహారం ఎలా?

- మార్కెట్లో భారీగా పెరిగిన సరకుల ధరలు
- ఆ మేరకు పెరగని మధ్యాహ్న భోజన పథకం చెల్లింపులు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ఒకవైపు మార్కెట్లో పప్పు దినుసులు, కూరగాయలు, నూనె ధరలు భగ్గుమంటున్నాయి. ఏటేటా పెరుగుతూపోతున్నాయి. అందుకు అనుగుణంగా మధ్యాహ్న భోజన్పపీఎం పోషణ్ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లింపులు చేయడం లేదు. ఫలితంగా 15 తరగతుల విద్యార్థులకు 450 కేలరీలు, 610 విద్యార్థులకు 700 కేలరీల శక్తి అందాలనే నిబంధన కాగితాలకే పరిమితమవుతోంది. నాసిరకం ఆహారమే దిక్కవుతోంది. తమకు చెల్లించే సొమ్ము గిట్టుబాటు కావడం లేదని వంట ఏజెన్సీ మహిళలు చెబుతుండగా.. పర్యవేక్షించాల్సిన ఉపాధ్యాయులూ చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఏటేటా బడిలో అన్నం తినే వారి సంఖ్య తగ్గుతూ వస్తున్నట్లు అధికార గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. డిసెంబరు నుంచి 15 తరగతులకు భోజనం వండి పెట్టినందుకుగానూ ఒక్కో విద్యార్థికి రూ.6.19, 610 తరగతులకు రూ.9.29ఔఅంతకుముందు రూ.5.45, రూ.8.17 చెల్లించేవార్మ చొప్పున ఏజెన్సీలకు చెల్లిస్తున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయి. 610 తరగతుల విద్యార్థులకు 700 కేలరీల శక్తి అందేలా రూపొందించిన మెనూలో 150 గ్రాముల బియ్యం, 75 గ్రాముల కూరగాయలు, 30 గ్రాముల పప్పుదినుసులు, 7.5 గ్రాముల వంట నూనె వినియోగించాలనేది నిబంధన. బియ్యం మాత్రం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది.ప్రస్తుతం కందిపప్పు ధర కిలో రూ.180 నుంచి రూ.200 వరకు ఉంది. అంటే 30 గ్రాముల కందిపప్పునకే రూ.5.40 ఖర్చవుతుంది. ఇక నూనె ధర కిలో రూ.150 వరకు ఉంది. ఈ లెక్కన 7.5 గ్రాముల కోసం రూ.1.25, కిలో కూరగాయల ధర సగటున రూ.50 అనుకున్నా 75 గ్రాములకు రూ.3.75 వ్యయమవుతుంది. అంటే ఈ మూడింటికే సుమారు రూ.10 ఖర్చవుతోంది. ఉల్లిగడ్డ, కారం, ఇతర మసాలా దినుసులు, వంటకు వినియోగించే కట్టెలు/గ్యాస్ వీటికి అదనం. ఈ లెక్కన నిబంధనల ప్రకారం భోజనం తయారీకి సగటున ఒక్కో విద్యార్థికి సగటున సుమారు రూ.12 నుంచి రూ.15 వరకూ ఖర్చవుతుందని భోజన నిర్వాహకులు పేర్కొంటున్నారు.ఔగురుకులాల్లో పూటకు రూ.15 నుంచి రూ.17 వరకు చెల్లిస్తున్నారు. నవోదయ పాఠశాలల్లో రోజుకు రూ.74 చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 6 నుంచి 10 తరగతులకు కనీసం రూ.15 చెల్లిస్తేనే ప్రమాణాల మేరకు భోజనం తయారుచేసేందుకు అవకాశం ఉంటుందన్ని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సమాఖ్యటీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్ అభిప్రాయపడ్డారు.కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల బృందం హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థఎన్ఐఎన్ శాస్త్రవేత్తలతో కలిసి 2022 నవంబరులో రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి, ఖమ్మం జిల్లాల్లో సర్వే నిర్వహించింది. పథకంలో నిర్దేశించిన మేరకు తృణధాన్యాలు, పప్పుదినుసులు, నూనె, కూరగాయలు లేకుండానే విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నట్టు తేల్చింది. యాదాద్రి జిల్లాలో 67 శాతం, ఖమ్మం జిల్లాలో 82 శాతం మంది మాత్రమే బడిలో భోజనం తింటున్నట్టు, యాదాద్రి జిల్లాలో 25 శాతం మంది, ఖమ్మం జిల్లాలో 22 శాతం మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు నిర్ధారించింది.

# గంజాయి అమ్ముతూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్..

- గంజాయి అమ్ముతూ పట్టుబడ్డ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- 1.1 కేజీల గంజాయి స్వాధీనం
- కూకట్‌పల్లి వసంత నగర్ బస్ స్టాప్‌లో ఘటన
- పరారీలో మరో నిందితుడు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గంజాయి అమ్ముతూ పట్టుబడ్డాడు. కూకట్‌పల్లి ప్రాంతంలోని వసంత నగర్ బస్ స్టాప్‌లో భరత్ రమేష్ బాబు అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గంజాయి అమ్ముతూ ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులకు శుక్రవారం దొరికాడు. నిందితుడి నుంచి 1.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన సంతోష అనే వ్యక్తి తరచూ అక్కడి నుంచి గంజాయిని తీసుకువచ్చి రమేష్ బాబుకి ఇచ్చి అమ్మకాలు జరిపిస్తూ ఉంటాడు. శుక్రవారం కూడా ఖమ్మం నుంచి తీసుకువచ్చిన గంజాయిని రమేష్ బాబుకి ఇస్తున్న సమయంలో ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. సంతోష్ మాత్రం గంజాయి ఇచ్చి దొరక్కుండా పరారయ్యాడు. గంజాయి అమ్మకాలను చేపడుతున్న భరత్ రమేష్‌బాబు మాత్రం ఎస్టీఎఫ్ సీఐ నాగరాజు, సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడి వద్ద 1.1 కేజీల గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న వారిలో సీఐ నాగరాజు తోపాటు ఎస్ఐ జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ అలీమ్, కానిస్టేబుళ్లు శశికిరణ్ కార్తీక్ ఉన్నారు. ఈ టీంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్ రెడ్డి, ఎస్టీఎఫ్ డీఎస్పీ తిరుపతి యాదవ్ అభినందించారు.




# మాదాపూర్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం..
# అతివేగానికి ఇద్దరు యువకులు బలి..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

అతి వేగానికి ఇద్దరు యువకులు బలయ్యారు. మాదాపూర్ పరిధిలో బైక్ అదుపుతప్పి డివైడర్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ రోడ్లో బుల్లెట్ బైక్‌పై వేగంగా ఇచ్చిన ఇద్దరు యువకులు డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడ్డారు. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు హాస్పిటల్ తరలిస్తుండగా ప్రాణాలు వదిలాడు. మృతులు బోరబండకి చెందిన రఘుబాబు, ఆకాన్ష్ గా గుర్తించారు. బైక్ నడుపుతున్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.. ఇదిలా ఉండగా.. వేగం కన్న.. ప్రాణం మిన్న.. అతివేగం ప్రాణానికే ప్రమాదకరం.. ఇలాంటి సూచనలు ఎన్ని పెట్టినా, పోలీసులు, రవాణాశాఖ ఎన్ని తనిఖీలు చేపట్టినా వాహనదారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు ముంచుకొస్తున్నాయి. ప్రమాదాల సంఖ్యను తగ్గించాలని చూస్తున్న పోలీసులకు సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, నిర్లక్ష్య తలనొప్పిగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ నిండు ప్రాణాలు కోల్పోయి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు తీరని దుఃఖం మిగులుస్తున్నారు. ఇటీవల సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, నిర్లక్ష్య , డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా వాహనాలపై దూసుకెళ్లడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. మృతుల్లో ఎక్కువగా యువకులే ఉంటున్నారు. తల్లిదండ్రులు మీ పిల్లలకు వాహనాలు కొనిచ్చే ముందు జాగ్రత్తలు చెప్పండి.. తాగి నడపొద్దని హితబోధ చేయండి..



# భూ భారతితో సాదాబైనామా రైతులకు మోక్షం

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న భూభారతి ఆర్ ఓఆర్ 2024 చట్టం ద్వారా సాదాబైనామాలకు మోక్షం కలగనుంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాదాకాగితంపై రాసుకుని.. రిజిస్ట్రేషన్లు చేసుకోని వారికి ఆశలు చిగురిస్తున్నాయి. భూభారతి ఆర్ఓఆర్ 2024 చట్టం ద్వారా రైతులకు ఎలాంటి లాభం జరుగుతుందో చూద్దాం..భూసమస్యలతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగిన రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. త్వరితగతిన పనులు జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో 25వేల 430 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. అందులో నల్లగొండ జిల్లాలో 13వేల 80, సూర్యాపేటలో 8వేల 564, యాదాద్రి జిల్లాలో 3వేల 786 దరఖాస్తులు రాగా.. ఫిర్యాదులపై దృష్టి సాధించారు రెవెన్యూ అధికారులు.

గ్రామీణ ప్రాంతాల్లో కొన్నేళ్ల కిందట సాదా కాగితంపై భూమి కొనుగోలు చేసి రాయించుకున్నారు రైతులు. వారిలో చాలామంది పేర్లు మార్చుకొని పట్టాలు తీసుకోలేదు. ధరణికి ముందున్న ఆర్ ఓఆర్ చట్టంలో సాదాబైనామాలతో పట్టాలు చేశారు. ధరణి వచ్చిన తర్వాత ఆ పనులు నిలిచిపోయాయి. కొంతకాలం తర్వాత వాటిని అమలు చేసేందుకు గత ప్రభుత్వం ముందుకొస్తే..ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 25వేల 430 దరఖాస్తులు వచ్చాయి. అమలులో జాప్యం, ఆ తర్వాత ఎన్నికలు రావడంతో అవి పరిష్కారానికి నోచుకోలేదు.

గత ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్ తీసుకొచ్చి.. భూ నిర్వహణ కొనసాగించింది. ధరణిలో అన్ని రకాల ఆప్షన్లు లేకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ధరణిలో సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ల కోసం ఆప్షన్లు లేకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రైతులు గత ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయగా.. చర్యలు చేపడతామని చెప్పి నిర్లక్ష్యం వహించింది. దీంతో దరఖాస్తులు చేసుకున్న రైతులు ..మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యలు పరిష్కరించేందుకు కొత్తగా భూభారతి ఆర్ ఓఆర్ చట్టం2024 తీసుకొచ్చింది. ఈ బిల్లును అసెంబ్లీ, మండలి ఆమోదించింది. త్వరలోనే చట్టం అమల్లోకి రానుంది. దాంతో సాదాబైనామా సమస్య పరిష్కారం కానుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# గుట్టుగా ఆ ఇంటర్ కళాశాలలకు అనుమతులు!

- రెండో ఏడాది విద్యార్థులకు పచ్చజెండా..
- అగ్నిమాపక ఎన్‌వోసీ లేకున్నా ఏళ్లుగా గుర్తింపు
- ప్రథమ సంవత్సరంలోనూ ప్రవేశాలు..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని గృహ, వాణిజ్య సముదాయాల్లో నడుస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు. వాటికి అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీలు లేవు. ఫలితంగా వాటిలో ప్రవేశాలకు ఇంటర్‌బోర్డు అనుమతించరాదు. అయితే ఏళ్లుగా ఆయా కళాశాలల యాజమాన్యాలు ఏదో సాకు చెబుతూ వాటిని కొనసాగిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, అందువల్ల ఈసారికి మినహాయింపు ఇస్తున్నామని సర్కారు సరే అనడం.. ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వడం.. షరామామూలుగా మారుతోంది. కరోనా నేపథ్యంలో గత 4 విద్యాసంవత్సరాలుగా అగ్నిమాపక నిబంధనలు పాటించకున్నా 350కి పైగా కళాశాలలకు అనుమతులిస్తూ వస్తున్నారు. ఈసారి దీనికి బ్రేక్ పడుతుందని భావించినా గుట్టుచప్పుడు కాకుండా ఇప్పటికే ఇంటర్ రెండో ఏడాదికి అనుమతులు ఇవ్వడంతో దీనిపై విమర్శలు వినిపిస్తున్నాయి.

**సమస్యకు చరమగీతం ఎప్పుడు?**

ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అనుమతి పొందాలంటే వాటిలో కనీస మౌలిక వసతులుండాలి. అలాగే ఆర్ అండ్ బీ, ట్రాఫిక్, శానిటేషన్ తదితర విభాగాలతోపాటు అగ్నిమాపకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తప్పనిసరి. రాష్ట్రంలో సుమారు 1200 ప్రైవేటు కళాశాలలుండగా.. వాటిలో 350కి పైగా గృహ, వాణిజ్య సముదాయాల్లోనే నడుస్తున్నాయి. వాటిలో కళాశాలలు నడపడం నిబంధనలకు విరుద్ధం. అగ్నిమాపక రక్షణపరంగా విద్యార్థులకూ ప్రమాదకరం. అందుకే వాటికి అగ్నిమాపకశాఖ ఎన్‌వోసీ ఇవ్వడంలేదు. ఈ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వకపోవడం.. చివరకు వాటిలో 70వేల నుంచి 80వేల మంది చదువుతున్నారని, వారి భవిష్యత్తు ఆగమాగం అవుతుందని, ఇప్పటికిప్పుడు సరైన భవనాలు దొరకవని యాజమాన్యాలు చెప్పడం.. చివరి నిమిషంలో సర్కారు ఈసారికి మినహాయింపు ఇస్తున్నామని ప్రకటించడం కొన్నేళ్లుగా సాగుతోంది. వాటికి ఎన్‌వోసీ ఇచ్చేదిలేదని 2020 మార్చిలో హోంశాఖ జీవో జారీచేసింది. అంటే గృహ, వాణిజ్య సముదాయాల్లో నడిచే కళాశాలలకు అనుమతి ఇవ్వడం కుదరదు. అయితే కరోనా నేపథ్యంలో 202021, 202122 విద్యాసంవత్సరాలకు ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వం అనుమతించింది. మళ్లీ యాజమాన్యాల వినతి మేరకు 2022-23, 2023-24 విద్యాసంవత్సరాలకూ ఎన్‌వోసీ లేకుండానే అనుమతి ఇచ్చింది. ప్రస్తుత విద్యాసంవత్సరానికి (2024-25) ఆయా కళాశాలలకు రెండో ఏడాదికి అనుమతులు ఇవ్వరాదు.

**35 వేల మంది ఫస్టియర్..**

నిబంధనల ప్రకారం వాటిలో అసలు ప్రథమ సంవత్సరం ప్రవేశాలే జరపరాదు. విచిత్రమేమంటే ఇలాంటి కళాశాలల జాబితాలను ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో పెట్టడంలేదు. దీంతో ఈసారి కూడా సుమారు 35 వేల మంది విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలు పొందారు. ఈ విషయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అవగాహన పెంచే ప్రయత్నం కూడా చేయలేదు. అయితే ఇటీవల గుట్టుచప్పుడు కాకుండా ఆయా కళాశాలల్లో రెండోసంవత్సరం చదువుతున్నవారి నుంచి పరీక్షల ఫీజు స్వీకరించడానికి ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్ నుంచి లాగిన్ ఓపెన్ చేశారు. అంటే రెండో ఏడాదికి అనుమతులిచ్చినట్లే లెక్క. ఇది ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో చేశారా? ఇంటర్‌బోర్డు అధికారుల సొంత నిర్ణయమా? అన్నది తేలాల్సి ఉంది.

# చదువుకు ఆదరువు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**



సర్కారు బడుల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో సకల వసతులతో బోధన, నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. విద్యావ్యవస్థ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది. ఇటీవలే అన్ని వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు ఒకే రకమైన రుచి, నాణ్యతతో కూడిన పౌష్టికాహారంతో కూడిన భోజనంను అమలు చేస్తున్నారు. ఈ ఏడాదిలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు వచ్చాయి.

**మెనూ ఛార్జీలు పెంపు.. సమకూరుతున్న వసతులు**

పదోతరగతి ఫలితాల్లో 2023 కంటే మూడు జిల్లాలు మెరుగైన స్థానాలు పొందింది. నల్గొండ జిల్లాలో అన్ని యజమాన్యాల పరిధిలో మొత్తం పాఠశాలలు 2,038 ఉండగా 2,29,374 మంది, సూర్యాపేట జిల్లాలో 1,303 పాఠశాలల్లో 1,49,693 మంది, యాదాద్రి జిల్లాలో 921 పాఠశాలలుండగా 1,16,396 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పాఠశాల నిర్వహణ కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో ఈ ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. మధ్యాహ్నభోజనం నాణ్యతగా వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నారు. అపరిష్కృత భవనాలను నిర్మించేలా ఈ కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. ఇటీవల గురుకులాలు, వసతిగృహ విద్యార్థులకు 40 శాతం వరకు మెనూ ఛార్జీలు పెంచారు. డీఎస్సీ ద్వారా నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేటలో 322 మంది, యాదాద్రిలో 169 పోస్టులు భర్తీ అయ్యాయి. ఈ సంవత్సరం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 ప్రభుత్వ, ప్రయివేటు ఐటీఐ కళాశాలలుండగా కేవలం బాలికల ఐటీఐ కళాశాలలో బ్రిడ్జి కోర్సులు ఏర్పాటు చేశారు.

కొత్త కోర్సులపై ఆశలు

యంగ్‌ఇండియాలో భాగంగా మూడు జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున సమీకృత గురుకుల పాఠశాలలు కేటాయించారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా కల్పించేందుకు బ్రిడ్జి కోర్సులు ప్రవేశపెట్టారు. సాంకేతిక పట్టభద్రులకు అపార ఉద్యోగావకాశాలను కల్పించేలా పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)లుగా ఆధునికీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐ, పాలిటెక్నిక్, ఏటీసీ కళాశాలను తీసుకువచ్చే విధంగా కార్యాచరణ సిద్ధమైంది. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై తత్సమాన కోర్సుల్లోనూ విద్యార్థులు ప్రత్యేక కోర్సుల్లో ప్రవేశాలు తీసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. రానున్న సంవత్సరంలో మరిన్ని విద్యా సంస్కరణలు అమలు చేయాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆసుపత్రిలో గుత్తేదారుల ఆగడాలు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**




జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో గుత్తేదారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. ఏళ్ల తరబడి తిష్టవేసుకుని టెండర్ దక్కించుకుంటున్న ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాలు, వేధింపులు ఉన్నతాధికారులతో పాటు ఇతరులకు చెప్పుకొంటే వారిని గుత్తేదారు తక్షణమే విధుల నుంచి తొలగించి వారి స్థానంలో రూ.లక్ష తీసుకుని మరొకరిని ఎంపిక చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. జనరల్ ఆసుపత్రిలో పడకల నిబంధనల మేరకు 180 మంది పారిశుద్ధ్య, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది ఉండాలి. కానీ 15 మంది వరకు ఎక్కువగా చూపించి కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. దీంతోపాటుగా విధుల నుంచి వెళ్లిపోయిన 15 మంది వేతనాలను నెల నెలా తీసుకుని గుత్తేదారు, సంబంధిత అధికారులు పంచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్)లో రాత్రి పూట విధులు నిర్వర్తిస్తున్న తనపై ఓ గుత్తేదారు అసభ్యంగా ప్రవర్తించి ఫొటోలు తీసి వేధింపులకు గురి చేస్తున్నాడని.. విధుల నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నాడని ఓ పారిశుద్ధ్య కార్మికురాలు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై నాగరాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

కొద్ది రోజుల క్రితం మాతాశిశు సంరక్షణ కేంద్రంలో పాత ఇనుప సామగ్రి గుత్తేదారు, సూపర్‌వైజరు గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుంటున్నారనే విషయం పత్రికల్లో రావడంతో దీనికి ఓ కార్మికుడే కారణమని భావించి తొలగించారు. న్యాయం చేయాలని తోటి కార్మికులు ధర్నాలు, ఆందోళన చేస్తే వారిని సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని తొలగించి కొత్తవారిని ఎంపిక చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవాలు పరిశీలిస్తున్నాం: డా.అరుణకుమారి, ఆసుపత్రి సూపరింటెండెంట్

కార్మికులను గుత్తేదారు ఇబ్బంది పెట్టిన విషయం మా దృష్టికి వచ్చింది. వీళ్ల మూలంగా ఆసుపత్రికి చెడ్డపేరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదుల్లో వాస్తవాలు పరిశీలిస్తున్నాం. పూర్తి వివరాలు నివేదిక రూపంలో కలెక్టర్, డీఎంఈకి ఇస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏజెన్సీపై చర్యలు తీసుకుంటాం.

# మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం, వెల్టూరు గ్రామంలో, కావాలి పెద్ద నాగన్న భార్య భాగ్యమ్మ, గతవారం ప్రహరీ గోడ ప్రమాదవశాత్తు కూలి మృతి చెందడం జరిగింది.ఇట్టి విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మాజీమంత్రి సింగరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం వెల్టూరు గ్రామంలోని మృతరాలి ఇంటికి వెళ్లి, కావలి పెద్ద నాగన్న కుటుంబాన్ని పమర్శించి, మానో ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి కావాలి పెద్ద నాగన్న కుటుంబతో న్యాయవాది వృత్తిలో ఉన్నప్పటి నుంచి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. తండ్రిని బాగా చూసుకోవాలని నాగన్న కుమారులకు సూచించడం జరిగింది. అనంతరం వెల్టూరు కన్మనూరు బలీదుపల్లి గ్రామాల బి అర్ ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి సాగునీరుకు సంబంధించి మరియు, రాజకీయ అంశాలపై ఆరా తీసి పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వేణు యాదవ్, వెల్టూరు టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మల్లక్ సురేష్, చిత్తూరు కృష్ణ రెడ్డి(జెసి.ప్రభాకర్ రెడ్డి), మాజీ జెడ్పిటిసి కె.రఘుపతి రెడ్డి, కన్ననూర్ భీమ్ రెడ్డి, దయాకర్ మాజీ ఎంపీపీ, రఘు వర్ధన్ రెడ్డి, సంభ యాదయ్య, కురుమన్న, ఖాజా హుస్సేన్, సర్వేశ్వర్ రెడ్డి, అంజి, ప్రజాప్రతినిధులు బి అర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉద్యమకారులు పాల్గొన్నారు.





## భారతదేశ ఆర్థిక అసమాన్యుడు అస్తమించడం దేశానికి తీరని లోటు

- మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యేక రాష్ట్ర బిల్లును ఆమోదింపజేసిన ఆర్థిక అసమాన్యుడు,భారత దేశ ఆర్థిక స్థిరత్వం కోసం ఎన్నో మహత్తరమైన పథకాలను రూపొందించిన మన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ హస్తమయం దేశానికి తీరని లోటని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం హైదరాబాదులోని మాదాపూర్ లో గల తన కార్యాలయంలో ఎమ్మెల్యే దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2004 నుంచి 2014 వరకు భారతదేశ ప్రధానిగా...33 ఏళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగినాయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందినట్లు వచ్చిన వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.ఎన్నో ఆర్థిక సంస్కరణలు, చేపట్టి భారతదేశ అభ్యున్నతికి, దేశ ఆర్థిక పురోగతికి నిబద్ధతగా పాటుబడిన గొప్ప నాయకుడని ఆయన ప్రశంసించారు.ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



## జిల్లా వాసికి ఫిజికల్ ఏడ్యూకేషన్‌లో డాక్టరేట్

- కుర్తివాడ గ్రామానికి చెందిన పైతర యాదగిరి

**మెదక్ జిల్లా ప్రతినిధి ,తెలంగాణ ముచ్చట్లు:**

మెదక్ జిల్లా పాపన్న పేట మండలం కుర్తివాడ గ్రామానికి చెందిన పైతర యాదగిరి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్. పి. వెంకట్ రెడ్డి చేతులమీదుగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో అందుకున్నారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఏడ్యూకేషన్ విభాగంలో పరిశొధన చేసినందుకు గాను యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్ ని ప్రదానం చేశారు. ఏ స్టడీ ఆఫ్ హెల్త్ రిలేటెడ్ ఫిజికల్ ఫిట్నెస్ అమాంగ్ గురుకుల స్కూల్స్ స్టూడెంట్స్ ఇన్ మెదక్ జిల్లా తెలంగాణ అనే అంశం మీద అరేండ్లు గా పరిశోధన చేశారు. మలి దశ ఉద్యమంలో నిజాం కాలేజీ నుండి ఓయు జేఏసీ నేతగా పోరాడి, తెలంగాణ రాష్ట్రం సిద్దించేలా తన వంతు పాత్ర పోషించారు. యూనివర్సిటీ మాజీ ఎడ్యుకేషన్ డీన్ పి. వెంకట్ రెడ్డి పర్యవేక్షణలో వ్యాయామ విద్యా విభాగంలో డాక్టరేట్ సాదించేందుకు సహకరించిన యూనివర్శిటీ ప్రొపెసర్లకు, అధికారులకు, యూనివర్సిటీ రిసెర్చ్ స్కాలర్ లకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, కుర్తివాడ గ్రామ ప్రజలందరికీ ఈ సందర్భంగా డాక్టర్ యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.




## ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను వెంటనే అమలు చేయాలి

- సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు డిమాండ్.

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సిపిఎం 29,30 డివిజన్ కమిటీల ముఖ్య కార్యకర్తల సమావేశం పెద్దోజు ఉపేంద్ర చారి, సారంగి పాపారావు లఅధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల వాగ్దానాలలో అనేక వాగ్దానాలను చేసింది. ముఖ్యంగా వృద్ధాప్య పింఛను, వితంతు పింఛన్లు 2000 నుండి 4000 రూపాయలు వికలాంగులకు 4000 రూపాయల నుండి 6000 ఇస్తామని చెప్పారు. అలాగే 18 సంవత్సరాల నుండి ఆ పైబడిన మహిళలకు నెలకు 2500 రూపాయలు చొప్పున ఇస్తామని చెప్పారు. అలాగే చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం జరిగింది. ఎన్నికల బహిరంగ సభలో రాహుల్ గాంధీ సోనియా గాంధీ సమక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది డిసెంబర్ 9న మీరు పింఛను 4000 రూపాయలు తెచ్చుకోండి అని సీఎం రేవంత్ రెడ్డి గారు ఆనాడు బహిరంగ సభలో చెప్పడం జరిగింది. అలాగే ఇంకా ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కూడా మీరు డిసెంబర్ 9వ తారీఖున అన్ని అమలైతాయి కాబట్టి మీరు ఇప్పుడు వెళ్లి తెచ్చుకోకండి డిసెంబర్ 9న వెళ్లి తెచ్చుకోండి అని సీఎం రేవంత్ రెడ్డి ఆనాడు హామీ ఇవ్వడం జరిగింది. వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు ఇలా పింఛను వచ్చే ప్రతి వాళ్లు తమ పింఛన్ ఎప్పుడు పెంచుతారు అని వేయికళ్లతో ఎదురుచూస్తూ ఉన్నారు కానీ ప్రభుత్వం నుండి గాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుండి గాని ఎలాంటి హామీని ఇవ్వలేకపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం దాటింది. ఇప్పటికైనా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని పేదవాళ్లకు ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇండ్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు రుణం ఇవ్వాలని ఖాళీ స్థలాలు ఉన్న వారందరికీ ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు రుణాన్ని వెంటనే మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని ప్రజా సమస్యలపై ఈ ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు షేక్ హిమామ్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ నాయకులు రంగు హనుమంతచారి, యర్రా నగేష్, షేక్ మదార్, షేక్ లాల్ బి, తదితరులు పాల్గొన్నారు.



## మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నివాస క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రోజున కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటనీ,దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన మహా ఆర్థిక మేధావి మన్మోహన్ సంగ్ అని ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రపంచంలోనే ఆర్థిక శక్తిగా నిలబెట్టిన ఘనత వారికే దక్కుతుందని అన్నారు.ఎటువంటి వివాదాలు లేకుండా 10 సంవత్సరాలు ప్రధానిగా పనిచేసి పేరు పొందారని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ సారథ్యంలోనే సాధ్యం అయిందని తెలిపారు.కేంద్ర మంత్రిగా చేసిన సేవలు దేశం ఎన్నటికీ మార్చిపోదని,సోనియా గాంధీకి ప్రధానిగా అవకాశం వచ్చినప్పటికి మన్మోహన్ సింగ్ ను ఆర్థిక మంత్రిగా తీసుకు వచ్చిన ఆర్థిక సంస్కరణల దృష్ట్యా ప్రధాని పదవిని వారికి ఇవ్వడం జరిగిందని,వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల డివిజన్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



## ఖమ్మంలో..నూకారపు సాయి తేజ కుటుంబానికి ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శ

- కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తో వెళ్లి ఓదార్పు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లిన ఖమ్మం జిల్లాకు చెందిన నూకారపు కోటేశ్వరరావు కుమారుడు నూకారపు సాయి తేజ..అమెరికాలోని చికాగో నగరంలో గత నెల 30వ తేదీన దుండగులు జరిపిన కాల్పుల్లో అకాల మృతి చెందగా.. ఈ విషయం కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ద్వారా తెలుసుకొని.. సాయి తేజ మృతదేహాన్ని ఇక్కడికి రప్పించడంలో విశేష కృషి చేసిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి గారు.. స్వయంగా శుక్రవారం ఖమ్మం రాపర్తి నగర్ లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్నప్పటికీ.. కొప్పుల చంద్రశేఖర్ ద్వారా వారి కుటుంబ సభ్యులను గతం లో ఫోన్ లో పరామర్శించి.. ధైర్యం చెప్పి.. ఇండియన్ ఎంబసీ, అమెరికా ఎంబసీ, తానా విభాగాల ద్వారా.. గతంలో పర్యవేక్షించి.. నూకారపు సాయి తేజ మృతదేహాన్ని ఇక్కడికి రప్పించిన విషయం విధితమే. అండగా ఉంటామని ధైర్యం చెప్పిన లోక్ సభ సభ్యులు రామ సహాయం.. పార్లమెంట్ సమావేశాల అనంతరం జిల్లాకు వచ్చిన ఖమ్మం ఎంపీ రామ సహాయం రెడ్డి.. కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తో కలిసి శుక్రవారం రాత్రి..నగరంలోని నూకారపు సాయి తేజ నివాసానికి వెళ్లి.. తల్లిదండ్రులు నూకారపు కోటేశ్వరరావు, వాణిలను ఓదార్చారు. భవిష్యత్తులోనూ తన నుంచి.. అన్ని రకాల సహకారం ఉంటుందని ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా.. సాయి తేజ కుటుంబ సభ్యులందరూ.. ఎంపీ రఘురాం రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



## భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి మాజీ ఎంపీ నామ సంతాపం

- వినయ విధేయత కలిగిన మహోన్నత వ్యక్తి మన్మోహన్ సింగ్ - మాజీ ఎంపీ నామ
- భారత ఆర్థిక వ్యవస్థ పై తనదైన ముద్ర వేసిన నిబద్ధత గల నాయకుడు మన్మోహన్ సింగ్ - మాజీ ఎంపీ నామ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అకాల మరణం పట్ల బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటు అని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ పై తనదైన ముద్ర వేసిన నిబద్ధత గల నాయకుడు, విద్యావంతుడు వినయ విధేయత కలిగిన మహోన్నత వ్యక్తి మన్మోహన్ సింగ్ అని నామ కొనియాడారు. 15వ లోక్ సభ లో తాను టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న సమయం లో పలు విషయాలు పైన మన్మోహన్ సింగ్ ను నేరుగా కలిసి చర్చించడం తో పాటుగా, లేఖలు రాయడం జరిగిందన్నారు. 2010 లో తీవ్రమైన జల్, కీలా తుఫాను వలన అకాల వర్షాలు పడి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వరి, పత్తి పంటలు దెబ్బతింటే ఆ రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని లేఖ రాయడం తో పాటు, ప్రధాన మంత్రి సహాయనిధి ద్వారా ఉమ్మడి జిల్లాలో పలువురికి వైద్య ఖర్చులు కింద ఆర్థిక సహాయం మంజూరు చేయించడం జరిగిందన్నారు. నాడు టీడీపీ అధినేత చంద్రబాబు రైతులు కొరకు దీక్ష చేస్తుంటే ఈ విషయమై మన్మోహన్ సింగ్ ను కలిసి ఆయన దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఆయన హాయంలోనే లోక్ సభ లో తెలంగాణ బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తాను తొలి ఓటు వేసాను అని, అంతే కాకుండా అనేక మార్లు వివిధ సమస్యలు పైన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ను కలిసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ చూపించిన మార్గదర్శకత్వం భవిష్యత్ తరాలకు ప్రేరణనిచ్చేదిగా నిలిచిపోతుందని కొనియాడారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడంలో ఆయన పోషించిన పాత్ర అమోఘమని గుర్తు చేశారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం, పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడం దేశ ప్రగతికి ఎంతో మేలు చేసిందని తెలిపారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్, ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి అనేక ప్రజల ప్రయోజన పథకాల ద్వారా సామాజిక న్యాయాన్ని కొనసాగించారని ప్రశంసించారు. ఈ కష్టకాలంలో కుటుంబసభ్యులు మనోధైర్యంతో ఉండాలని, మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు, మాజీ ఎంపీ నామ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "మన్మోహన్ సింగ్ జీవితం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, దేశ అభివృద్ధి పట్ల ఆయన చూపిన కృషి చిరస్మరణీయంగా నిలుస్తుంది" అని నామ అన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దార్శనికత.. భావితరాలకు స్ఫూర్తిదాయకం

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆర్థిక సంస్కరణల సారధికి ఘన నివాళి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

విజ్ఞానం, వినయం కలిగిన అత్యంత విశిష్ట నేత భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని.. దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను సమూలంగా మార్చివేసిన గొప్ప దార్శనికుడు అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ల దుర్గాప్రసాద్, తదితర నేతలతో కలిసి శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి.. ఘన నివాళులు అర్పించారు. రెండు నిమిషాలపాటు మౌనం పాటించి సంస్కరణాల పితామహుడికి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రిగా, ఆపై పదేళ్లపాటు ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి..దేశాన్ని ద్రవ్యోల్బణ గండం నుంచి గట్టెక్కించారని, దేశ పురోభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు.



**కీలక చట్టాలకు ఆద్యులు**

2004లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టాక.. మన్మోహన్ సింగ్ పదేళ్లపాటు ఆర్థిక వ్యవస్థకు దిశా నిర్దేశం చేశారని, సంక్షేమానికీ పెద్దపీట వేశారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా.. కోట్లాదిమంది పేద ప్రజలకు పని చూపించి.. వారి ఆకలి బాధలు తీర్చారని అన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత కోసం.. 2005లో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని గుర్తు చేశారు. విద్యాహక్కు చట్టం, భూ సేకరణ చట్టాలతో ప్రజలకు మేలు జరిగేలా చూశారని అన్నారు. మన్మోహన్ సింగ్ ముందుచూపు ఉన్న నేత అని, మచ్చలేని విశిష్ట నేతను కోల్పోవడం ఎంతో బాధాకరమని ఎంపీ ఈ సందర్భంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, మహిళా జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు మిక్కిలినేని నరేంద్ర, కొప్పుల చంద్రశేఖర్, సంతోష్ కుమార్, మంకెన వాసు, స్ఫూర్తి ఓం రాధాకృష్ణ, దీపక్ చౌదరి, దుంపల రవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## పకడ్బందీగా ఇందిరమ్మ ఇండ్ల

# దరఖాస్తుల సర్వే నిర్వహణ...

- రాష్ట్ర హౌజింగ్ ఎండి వి.పి. గౌతమ్
- ఖమ్మం రూరల్, నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను పరిశీలించిన హౌజింగ్ ఎండి

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**



ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా జిల్లాలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర హౌజింగ్ ఎండి వి.పి. గౌతమ్ అన్నారు.శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం జలగం నగర్, ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని మోతి నగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేను రాష్ట్ర హౌజింగ్ ఎండి, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌజింగ్ ఎండి మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేపై దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందించాలని,ప్రజలు సైతం అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధం చేసుకొని సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్ లతో సహకరించాలని తెలిపారు.

ప్రతి రోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్ లు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తు సర్వే పూర్తి చేయాలని, సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు అవసరమైతే అదనపు లాగిన్లు రూపొందించాలని ఎండి అధికారులకు తెలిపారు.ప్రతి దరఖాస్తు ద్వారానే ఇంటికి వెళ్లి ప్రస్తుత స్థితి గతి తెలిసేలా ఫోటో యాప్ లో అప్లోడ్ చేయాలని, డాక్యుమెంట్ల ప్రకారం యాప్ లో ప్రతి కాలం సరిగ్గా పూరించాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు రావడానికి వీలులేదని ఎండి అన్నారు. ఎండి తనిఖీల సందర్భంగా డిఆర్డీవో సన్యాసయ్య, హౌజింగ్ పిడి బి. శ్రీనివాసరావు, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాం ప్రసాద్, ఎంపీడీఓ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. అదేవిధంగా సరిహద్దుల నుండి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని అన్నారు. స్టేషన్ హౌస్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ ఆఫీసర్ల భాధ్యతలు, రెగ్యులర్ రోల్ కాల్ విధిగా అమలు చేయాలని సూచించారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు







## వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవగాహన సదస్సు

**హనుమకొండ, తెలంగాణ ముచ్చట్లు:**

వరల్డ్ హ్యూమన్ రైట్స్ 2024 ఇయర్ అవగాహన సదస్సు హైదరాబాద్లోని తెలంగాణ సరస్వత పరిషత్ అబిడ్స్ భవన్లో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ అండ్ మూమెంట్ జాతీయ అధ్యక్షులు జనాబ్ మొహమ్మద్ అర్షద్ ఖాన్ మాట్లాడుతూ హైకోర్టులో సుప్రీంకోర్టులలో కొన్ని వేల సంఖ్యలో కేసులు పరిష్కారం కాకుండా ప్రజలకు న్యాయం జరగకుండా సతమత అవుతున్నారు. అలాంటి ప్రజలు మన హ్యూమన్ రైట్స్ కమిషన్ను ఆశ్రయిస్తున్నారు వారి సమస్యలను మన ద్వారా పరిష్కారం చేసుకుంటున్నారు అని అన్నారు. మానవ హక్కుల కమిషన్ పై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అలాగే మీరు మీ జిల్లాలలో చేస్తున్న సేవలను మీకు ఆటంగాలలో ఎదురైతే మీ యొక్క జిల్లా కలెక్టర్లు పోలీస్ వ్యవస్థలో మీకు సహకరించేలాగా ఉండాలని అన్నారు గతంలో జరిగిన షబ్బీర్ అలీ చేసిన పొరపాట్లు మన లీగల్ ప్రకారం అతన్ని ఈ సంస్థ నుండి పూర్తిగా తొలగించబడ్డది అతనిపై లీగల్ చర్యలు కూడా తీసుకుంటాము అని చెప్పారు ఏదైనా సమస్య వచ్చినచో రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ యూసుఫ్ బాయ్ మరియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ యాకుబ్ అలి మరియూ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూర్తిగా బాధ్యత అప్పచెబుతున్నాను అని అన్నారు.తెలంగాణలోని 33 జిల్లాల్లో హనుమకొండ,వరంగల్, సిరిసిల్ల, నిజామాబాద్,మంచిర్యాల,ఆసిఫాబాద్,పెద్దపల్లి జిల్లాలోని అధ్యక్షులను ఉపాధ్యక్షులను ప్రత్యేకంగా అభినందించారు మిగతా జిల్లాలు కూడా ఆదర్శంగా తీసుకొని పని చేయాలి అని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ,ఆంధ్ర,తమిళనాడు,కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుండి హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు హాజరైనారు.ఈ క్రమంగా గతంలో సభ్యులకు ఐడి కార్డ్స్ డిస్ట్రిబ్యూట్స్ చేసినవి రద్దు చేస్తూ కొత్త కార్డులు జారీ చేయబడును అని అన్నారు ఏమైనా సమస్యలు ఎదురైతే జిల్లా అధ్యక్షులు రాష్ట్ర నాయకులకు విన్నపించుకోవాలి రాష్ట్ర నాయకులు వెంటనే స్పందించి వారి యొక్క సమస్యలు పరిష్కరించాలి అని జాతీయ అధ్యక్షులు మొహమ్మద్ అర్షద్ ఖాన్ సభాముఖంగా మాట్లాడినారు.




## రౌడీ షీటర్ల ఆగడాలను

# ఉక్కుపాదంతో అణిచి వేయాలి

- నేరాల నియంత్రణలో పోలీసులు బాధ్యతతో వ్యవహరించాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**



వరంగల్ కమిషనరేట్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తూ, చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వ్యక్తులతో పాటు రౌడీషీటర్ల ఆగడాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. నెలవారి సమీక్షలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపిలు,అదనపు డిసిపి,ఎసిపిలు,ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్,డివిజినల్, జోన్ల వారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టులు,దర్యాప్తు,సాక్ష్యాధారాల సేకరణ,చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు,అస్తి నేరాలు, పోక్సో కేసులు,మిస్సింగ్,గంజాయి, రొడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించిన సమాచారంతో పాటు,కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మొదలైన అంశాలపై పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్షా జరిపారు.ఈ సమావేశంలో నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకొవాల్సిన ముందస్తూ చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించడంతో పాటు,అధికారులకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేస్తూ పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకొవాల్సి వుంటుందని ముఖ్యంగా మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధను కనబరచాలని అంతేకాకుండా పోలీసులు నేర నియంత్రణలో బాధ్యతగా వ్యవహరించాలని నిజాయితీగా పనిచేయాలని,సివిల్ పంచాయితీలకు దూరంగా వుండాలని,తప్పుడు కేసులు నమోదు చేయవద్దని,విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా లేకుంటే శాంతి భద్రతలు అదుపు తప్పుతుందని ప్రధానంగా ముందస్తూ సమాచారంతో పాటు,రౌడీ షీటర్ల స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డిసిపిలు రాజమహేంద్రనాయక్,రవీందర్,ఏఎస్పి మనాన్ భట్,అదనపు డిసిపి రవితో పాటు ఎసిపిలు,ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, పాల్గొన్నారు.




## ఉపాధి హమీ,రైతు కూలీలకు

# ఏడాదికి 12 వేల రూపాయలివ్వాలి

- ఉపాధి హామీ కూలీలకు,వ్యవసాయ కూలీలకు ఇచ్చే 12 వేల పథకానికి మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలి.
- డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్.

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ఉపాధి హామీ,వ్యవసాయ కూలీ కుటుంబాల అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి డిబిఎఫ్ బహిరంగ లేఖ భూమిలేని ఉపాధి హామీ,రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసే పథకాన్ని ప్రవేశ పెట్టి విధివిధానాలను రూపొందించి వెంటనే అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి కి డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ వరంగల్ నుండి బహిరంగ లేఖ ద్వారా తెలిపారు.

ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ లో భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజెస్తామని హామీ ఇచ్చారని,

మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాపాలన కూలీల ఆర్థిక సహాయానికి దరఖాస్తులను స్వీకరించారు.రాష్ట్ర బడ్జెట్ లో 1200 కొట్లను సైతం కేటాయించారు.ఇటివల డిప్యూటీ సియం,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కూలీల ఆర్థిక సహాయ పథకాన్ని డిసెంబరు 28 (నేటి) నుండి అమలు చేస్తామని వేర్వేరు గా ప్రకటించారు. ఈ ఫథకం అమలు కు నేటికి మార్గదర్శకాలను విడుదల చేయలేదు.కాని పత్రికలలో వివిధ కథనాల ప్రకారం భూమి లేని వారికి,ఉపాధి హామీలో వంద రోజులు పూర్తి చేసిన కూలీలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తున్నది ప్రచారం జరుగుతుంది.కాని గత పదేళ్ళగా బిజెపి అధ్వర్యంలో ని కేంద్ర ప్రభుత్వం నిధులను తగ్గించడం,ఆన్ లైన్ హాజరు NMMS,అధార్ బెసెడ్ పెమెంట్ పేరుతో ఉపాధి పథకాన్ని ఎత్తివేయా దానికి చెస్తున్న కుట్రలో బాగంగా కూలీలకు సక్రమంగా పనులు కల్పించడం లేదు.చేసిన పనికి సకాలంలో వేతనాలు అందడం లేదు.కనీస వేతనం చెల్లించకపోవడంతో ఉపాధి హామీ కూలీలు ఉపాధి హమి పని పట్ల విముఖత చూపించాల్సిన పరిస్థితి కి నెట్టబడ్డారు.వందరోజుల పని లక్షాలాది కుటుంబాలకు అందలేదు. కేంద్ర ప్రభుత్వ Mgnregs వెబ్ సైట్ ప్రకారమే 2023 24 ఆర్థిక సంవత్సరంలో కేవలం 1,34,963 లక్షల కుటుంబాల కు,202425 ఆర్థిక సంవత్సరంలో కేవలం 30,380(26122024 నాటికి) వేల కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పని దినాలు కల్పించారు.కనుక వందరోజుల ప్రతిపాదికన ఆర్థిక సహాయం అందజెస్తే లక్షలాది మంది కూలీలు నష్టపోతారు.

ఈ నేపథ్యంలో దళిత బహుజన ఫ్రంట్ నిర్దిష్ట ప్రతిపాదనలను మీ ముందు వుంచుతున్నామన్నారు.

**డిబిఎఫ్ ప్రతిపాదనలు**

1). భూమిలేని మరియు ఒక ఎకరం లోపు భూమి వున్న కుటుంబాలకు ఈ పథకానికి ఎంపిక చేయాలి.

2). ఉపాధి హామీ పథకం లో వంద రోజులు పూర్తి చెసిన వారికి పరిమితం చేయకుండా రాష్ట్రంలో 53 లక్షల ఉపాధి హామీ జాబ్ కార్డులో పెర్లు వున్న 1.10 కోట్ల కూలీలకు అమలు చెయాలి.

3) విడతలో వారిగా కాకుండా ఒకేసారి 12 వేలు చెల్లించాలి.

4) పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఏడాదికి ఒకసారి 12 వేలు కాకుండా ప్రతి నెల 3 వేల రూపాయలు చెల్లించాలని కొరుతున్నాం.

5) పట్టణ,మహిళ గృహ తదితర అసంఘటిత కార్మికుల కు ఈ పథకాన్ని వర్తింప చేయాలి.

6) గ్రామిణ ఉపాధి హామీ కూలీలకు రైతుభీమా లాగా కూలీ భీమా పథకాన్ని అమలు చేయాలి.

7) ఒంటరి స్త్రీలకు,వికలాంగులకు ప్రధాన్యత నివ్వాలి.

ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్,జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు పోలేపాక మల్లేషం,రాము,రమేష్,రవి,సిద్దార్థ, శివ,మహేందర్,కృష్ణ,రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వాలు మారినా..

# గీతన్నల తలరాతలు మారట్లే..!

- తాటి చెట్టు పై నుండి పడి నాగపూరి వెంకటస్వామి మృతి
- 10 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా ప్రకటించాలి
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ డిమాండ్

**మొగుళ్లపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

ఎన్ని ప్రభుత్వాలు మారినా గీతా కార్మికుల తలరాతలు మాత్రం మారడం లేదు.మొగుళ్లపల్లిలో మరో గౌడన్న జీవితం నేల రాలింది.దీంతో ఆ కుటుంబం వీదిన పడ్డట్లయింది. తాటి చెట్టు పై నుండి పడి నాగపూరి వెంకటస్వామి 54 గీతా కార్మికుడు గురువారం సాయంత్రం సుమారు 6:30 గంటలకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు.ఈ క్రమంలో గమనించిన తోటి గీతా కార్మికులు ఆయనను ప్రైవేట్ వాహనంలో హన్మకొండ జిల్లాలోని ఆరేపల్లిలో గల ఎస్ ఎస్ ఆర్ అనే ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.గీతా వృత్తినే నమ్ముకుని కుటుంబ జీవనాన్ని గడుపుతున్న నాగపూరి వెంకటస్వామి మృతితో ఆ కుటుంబం వీధిన పడ్డట్లయింది.రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి నాగపూరి వెంకటస్వామి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా నాగపూరి వెంకటస్వామి భౌతిక కాయాన్ని సందర్శించిన వారిలో చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ బండి సుదర్శన్ గౌడ్, మొగుళ్ళపల్లి మాజీ ఎంపీటీసీ ఎర్రబెల్లి వనితపున్నం చందర్ రావు, మాజీ సర్పంచ్ బత్తిని శ్రీహరి గౌడ్, జై గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల కిరణ్ గౌడ్, మండల అధ్యక్షుడు బత్తిని వెంకటేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు బత్తిని రమేష్ గౌడ్, మాదారపు రవి గౌడ్, వేముల నందం గౌడ్, బత్తిని స్వామి గౌడ్, వేముల రమేష్ గౌడ్, బత్తిని సంపత్ గౌడ్, వడ్లకొండ అశోక్ గౌడ్, బత్తిని భాస్కర్ గౌడ్,బత్తిని రమేష్ గౌడ్, బత్తిని నరహరి గౌడ్,చెక్క పట్టాభి గౌడ్,చెక్క నరేష్ గౌడ్,చెక్క సుభాష్ గౌడ్, శ్రీపతి శ్రీనివాస్ గౌడ్, వేముల సత్యం గౌడ్ తదితరులున్నారు.

# మాజీ ప్రధానికి ఎమ్మెల్యే మట్టా ఘన నివాళులు

**సత్తుపల్లి , తెలంగాణ ముచ్చట్లు:**



మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఆయన మరణం పట్ల శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామిశెట్టి సుబ్బారావు, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, ఉడతనేని అప్పారావు, చల్లగుళ్ళ నరసింహారావు లు సంతాపం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందన్నారు. మన్మోహన్ సింగ్ మొదట ప్రధానమంత్రి పివి నరసింహా రావు మంత్రి వర్గంలో ఆర్థికశాఖ మంత్రిగా సేవలందించారని, దేశంలో నేడు అమలు జరుగుతున్న సంస్కరణలకు ఆయనే బాధ్యుడు అన్నారు. దేశం అభివృద్ధి పథంలో నడవడానికి పునాదులు వేశారన్నారు .2004 నుండి 2014 వరకు ప్రధానమంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ దేశ ప్రగతికి తోడ్పడ్డారన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు .వారి మరణం దేశానికి తీరని లోటన్నారు. మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనందబాబు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివ వేణు, కమల్ భాష, నరుకుల్ల అప్పారావు, గంగ శెట్టి ప్రసాదు, కుమారి, మున్సిపాలిటీ కౌన్సిలర్లు మందపాటి పద్మ జ్యోతి రవీందర్ రెడ్డి, గఫార్, నాగుల మీరా, కంటి అప్పారావు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ యుఐ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, తెలంగాణ ముచ్చట్లు**

సి.ఎం. కప్2024 పోటీలలో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఈ నెల 27వ తేదీ నుండి కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ లలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు బయలు దేరుతున్న బస్సులను గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుండి జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్ వీరు, షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ఈ. డి. దుర్గాప్రసాద్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సి.ఎం. కప్ 2024 పోటీలలో భాగంగా జిల్లాలో గ్రామపంచాయతీ, మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలలో వివిధ క్రీడా విభాగాలలో పోటీలను నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా నుండి 190 మంది క్రీడాకారులు ఈ నెల 27వ తేదీ నుండి జనవరి 2, 2025 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని, సింగరేణి సంస్థ ద్వారా క్రీడాకారులకు టీ షర్ట్, లోయర్, క్యాప్ లతో కిట్లను అందించడం జరిగిందని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యం తో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని, ఏకాగ్రత పెంపొందుతుందని అన్నారు. గెలుపుఓటములను సమానంగా తీసుకోవడం, నాయకత్వం, స్నేహతత్వం అలవాటు అవుతాయని, క్రీడాకారులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా పట్టుదలతో కృషి చేసి, రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, క్రీడాకారులు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.



## సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

**తుర్కయంజాల్,తెలంగాణ ముచ్చట్లు**

ఇబ్రహీంపట్నంలో శనివారం, ఆదివారం జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, సామేల్ పిలుపునిచ్చారు. భారత్‌గార్డెన్స్‌లో మహాసభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా యాదయ్య, సామేల్ మాట్లాడుతూ పేదలు, కార్మికులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయంతో అంకితభావంతో సీపీఎం ఉద్యమిస్తుందని అన్నారు. కార్మికులు, కర్షకులు, మహిళలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులపై, రాష్ట్రాల హక్కులపై, భారత రాజ్యాంగంపై దాడి జరుగుతోందన్నారు. పార్లమెంట్ లో అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ అంబేద్కర్ చౌరస్తాలో జరిగే బహిరంగ సభ ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ, డీజీ నరసింహారావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కందుకూరి జగన్, నరసింహ, శ్యాంసుందర్, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, నాయకులు జగన్, వీరేష్, స్వప్న, బుగ్గరాములు, ప్రకాష్ కారత్, శంకర్, స్వామి, యాదగిరి, చరణ్, దశరథ, రజాక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళి

**మునుగోడు, తెలంగాణ ముచ్చట్లు**

భారతదేశానికి మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ విశిష్ట సేవలు అందించారని, ఆయనకు మరణం లేదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గాదేపాక అంజయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఆర్థికవేత్తగా, ఆర్బీఐ గవర్నర్ గా, దేశ ఆర్థిక శాఖ మంత్రిగా అనేక సేవలందించారని కొనియాడారు. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సందర్భంలో తన ఆలోచనా విధానంతో అనేక సంస్కరణలు చేపట్టి దేశాన్ని కాపాడారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అనేక సేవలు అందించి రెండుసార్లు భారత ప్రధాని అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, పోలగోని సత్యం,జాజుల అంజయ్య గౌడ్, వేమిరెడ్డి జితేందర్ రెడ్డి, పాలకూరి యాదయ్య, మిర్యాల వెంకన్న, బూడిద లింగయ్య, జాల వెంకన్న, బోయపర్తి లింగయ్య, కుంభం చెన్నారెడ్డి, మాధగోని రాజేష్, పందుల నరసింహ, సాగర్ల లింగస్వామి, ఎండి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ మరణం బాధాకరం

మెదక్ ఎంపీ రఘునందన్

**మెదక్, తెలంగాణ ముచ్చట్లు:**



భారతదేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని అలాగే ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు



## ఆర్థిక సంస్కరణాలకు అధ్యుడు దేశ ఆర్థిక శిల్పి మన్మోహన్ సింగ్

- మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు
- నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్

**ఆత్మకూర్,తెలంగాణ ముచ్చట్లు:**

ఆర్థిక సంస్కరణలకు ఆధ్యుడు,అవిశ్రాంత యోధుడు,మహోన్నత నాయకుడు భారత దేశ ఆర్థికశిల్పి మాజీ ప్రధాని,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మాదాసి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు.అనంతరం నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ సారథ్యంలో మన దేశం అత్యధిక వృద్ధి రేటు సాధించి, ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఇండియన్ ఎకానమీ సూపర్ పవర్ గా గుర్తించబడిందని అన్నారు. ప్రపంచాన్ని కుదిపేసిన ఆర్థిక మాంద్యం ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై పడకుండా గాడిలో పెట్టిన ఘనత మన్మోహన్ సింగ్ దని కొనియాడారు.2005 లో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమాచార హక్కు చట్టం మన దేశ పౌరుల హక్కులను కాపాడితే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 100 రోజుల వేతన ఉపాధి హామీనిచ్చి నిరుపేదల జీవితాలకు మార్గదర్శి అయిందని అన్నారు.ఆ మహనీయుని సంస్కరణలు, సాధించిన విజయాలు మన దేశ ప్రతి పౌరుడికి ఆదర్శమని కొనియాడారు. మన్మోహన్ సింగ్ మరణం పూడ్చలేనిదని అన్నారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికరాల వాసు,గ్రామ పార్టీ అధ్యక్షులు బయ్య కుమారస్వామి,మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, ముత్స్య శాఖ చైర్మన్ బయ్య తిరుపతి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఖాజా,ఫ్యాక్స్ డైరెక్టర్ జయపాల్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్ కాడబోయిన రమేష్,మండల ప్రధాన కార్యదర్శి గుండెబోయిన శ్యామ్, మాజీ వార్డు సభ్యులు కడబోయిన రవి, గ్రామ ప్రధాన కార్యదర్శి అలువాల రవి, మండల నాయకులు బూర రాజేందర్,సంగె మహేందర్,వడ్డేపల్లి ప్రసాద్, వడ్డేపల్లి వేణు, మండల యూత్ ప్రధానకార్యదర్శి పిట్టల రాజకుమార్, దురిశెట్టి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## భారత కమ్యూనిస్టు పార్టీ కి పురోగమనమే తప్ప తిరోగమనం లేదు

- శక్తివంతమైన నాయకులు వారి త్యాగాలు కమ్యూనిస్ట్ పార్టీని చరిత్ర శిఖరాన నిలిపాయి.
- సీపీఐ మండలం కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్

**నేలకొండపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజల కొరకు సర్వం ఒడ్డి పోరాడిన వేలాది మంది త్యాగాధనలకు కాణాచి కమ్యూనిస్టు పార్టీ. భారత కమ్యూనిస్ట్ పార్టీకి భవిష్యత్ లో పురోగమనమే తప్ప తిరోగమనం లేదు అని సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్ తెలిపారు.గురువారం మండల కేంద్రంలో లోని కర్నాటి క్రిష్ణయ్య నగర్ లో సీపీఐ శత వసంతాల సందర్భంగా మండలం సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ నూతన పార్టీ దిమ్మెను ఏర్పాటు చేశారు. పార్టీ నూతన దిమ్మెను భాను ప్రసాద్ ఆవిష్కరించి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... భారత కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పడి వంద సంవత్సరాల అయినది అని ఈ శత వసంతాల లో శక్తివంతమైన నాయకులు వారి త్యాగాలు కమ్యూనిస్ట్ పార్టీ ని చరిత్ర శిఖరాన నిలిపాయి అని తెలిపారు. పేద ప్రజలకు దన్నుగా నిలిచిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమే నని బూర్జువా పార్టీలు పదవుల కోసం, పంపకాల కోసం, అధికారం కోసం మాత్రమే పని చేస్తారని అన్నారు. ఎర్ర జెండా పేదలకు ధైర్యాన్ని ఇచ్చిందని, బాధితులకు బాసటగా నిలిచిందని అనేక చారిత్రక విజయాలను సాధించిందని ఆయన తెలిపారు. ఆర్థిక అంతరాలు నిత్యం పెరుగుతుండడం తో ప్రజాలకు రక్షణ కరువైన ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీల అవసరం పెరుగుతుందన్నారు. సామాన్యుల హక్కుల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులను బలపర్చాలని అన్నారు. అనంతరం కర్నాటి క్రిష్ణయ్య భవనం వద్ద కాశబోయన ఆయెధ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, సిపిఎం మండల నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల కౌన్సిల్ సభ్యులు, కర్నాటి నళిని రాణి,మేకల పుల్లయ్య, రాయల మాధరావు, పొలంపల్లి నారాయణ,పలాపాటి అశోక్, మండలం నాయకులు చెన్నబోయిన మల్లయ్య, చావా గణపతి, నంబూరి నారాయణ, ముత్యాల వేంకటేశ్వర్లు , భద్రజీ వేంకటేశ్వరరావు,మాలోతు ఆయెధ్య, వల్లల కృష్ణ, భూక్యా రాములు, గుడిమెట్ల శ్రీనివాసరావు, బడుగు మాధవ రావు,గుగులోతు స్వామి నాయక్,దొండా వెంకన్న, మూడు శ్రీనివాసరావు, ఎచ్చెర్ల గౌరిశంకరావు, మహేశ్వర అప్పారావు, దాసరి స్వామినాధం,మహిళా నాయకులు మారిశెట్టి విజయదుర్గ, బడుగు రాజేశ్వరి,సిఐటియు జిల్లా నాయకుడు గండారపు రామారావు, సిపిఎం నాయకుడు కొల్లి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు



## ఐక్యతతోనే అభివృద్ధి లేకుంటే వెనుక పడతాం

- అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు
- రాములునాయక్

**ఆసిఫాబాద్, తెలంగాణ ముచ్చట్లు**




జిల్లా కేంద్రం లోని ఆదివాసి భవన్ లో మాజీ ఎమ్మెల్సీ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ అన్నారు. ఆయన అధ్వర్యంలో జరిగిన బంజారా సోదరులు అన్ని సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బంజారా సంఘాలతో ఐదు ప్రధాన అంశాలపై చర్చించారు. అందులో మొదటిది బంజారా భాషను కేంద్ర ప్రభుత్వం 8 వ షెడ్యూల్ లో చేర్చి అధికారిక భాష గుర్తింపు ఇవ్వాలి అని, రెండవ డిమాండ్ దేశ రాజధాని లో పార్లమెంట్ , సుప్రీం కోర్టు స్థలం బాబా లక్కీషా బంజారా దని పార్లమెంట్ భవనం లో బాబా లక్కీషా బంజారా ప్రతిమ ప్రతిష్ఠించాలని, వక్ఫ్ బోర్డ్. దేవదాయ భూములు లాగా హాతిరం బాబా మఠానికి ఉన్నా భూములు రక్షణ ఇవ్వాలని టీటీడీ బోర్డు సభ్యులు గా బంజారా జాతికి చెందిన వ్యక్తికి నియమించాలని, సంత్ శ్రీ బాలబ్రహ్మ చారి తపస్విడా,రామారావ్ మహారాజ్ , భారత రత్న ఇవ్వాలని ,ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15 నా జరిపే శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున ప్రభుత్వం అధికారిక సెలువు ప్రకటించాలని ప్రధాన డిమాండ్ తో తమ సంఘం ముందుకు వెళ్ళుతుందని చెప్పారు. ఈ సంధర్భంగా శ్యామ్ నాయక్ మాట్లడుతూ మనలో ఐక్యత లోపం ఉంటే మన అభివృద్ధిలో కూడ లోపం ఉంటుంది అని కావున వివిధ ప్రాంతాలలో వివిధ రకాల పార్టిలో ఉన్నా పరవాలేదు కానీ జాతికి సమస్య వచ్చినప్పుడు కూడా ఏకం కాకపోతే అది రేపటి రోజున పెను సమస్యగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. ఓక జాతి నాయకుడు తన జాతి నాయకుడిని వదిలి వెరే సామాజిక వర్గాలకు డబ్బాలు కొట్టే నాయకులు ఉన్నని రోజులు మనకు రాజ్యాధికారం జన్మలో రాధని స్పష్టం చేశారు. అలాగే నాడు దేశానికి దారి చూపించిన మనం నేడు దారి తప్పి విడివిడిగా విడిపోయి రాజ్యాధికారానికి దూరం అయ్యే స్థితిలో ఉన్నాం అని ఆవేధన వ్యక్తం చేశారు .ఇది ఇలానే కొనసాగిస్తే అన్ని పార్టీల్లో మన సామాజిక వర్గానికి తీవ్ర నష్టం జరుగుతోంది అని అన్నారు కావున ప్రతి ఒక్కరు ఐక్యతగా ఉండి మన వాట మనకు వచ్చేలా మన హక్కులు చేజిక్కించుకునేలా కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నాడవాలని కోరారు. కార్యక్రమం లో పాల్గొన్న అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జిల్లా అధ్యక్షులు. రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ బంజారా సోదరుల ఐక్యత కోసం అన్ని సంఘాలు కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన సమయం అస్సన్నమైంది కాబట్టి అన్ని సంఘ్ జిల్లా నాయకులు తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది అని పేర్కొన్నారు.కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు కిషన్ సింగ్ గారూ,బానోత్ విలాస్ నాయక్, సేవా దళ్ ,.జిల్లా నాయకులు. రాథోడ్,శంకర్ నాయక్ బాధవత్,ఇందులాల్ నాయక్, అజ్మీరా బాబురావ్ నాయక్, రాథోడ్ బలిరామ్ నాయక్, బాదావత్, శివప్రసాద్ నాయక్ ,గులాబ్ నాయక్, ఇస్లావత్ ,శ్యామ్లాల్ నాయక్ రాథోడ్ ఈశ్వర్,జాదవ్ ,రమేష్ రాథోడ్ ,నారాయణ,రాథోడ్ భీంరావ్, లకావత్ శంకర్, తారాచంద్, సుభాష్, ప్రవీణ్, గొర్సింగ్ ,రంజిత్ ,వెంకీ తదితర నాయకులు ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉన్న ఉద్యోగులు ,జాతి మేధావులు పాల్గొన్నారు.



## మాలదారులకు 55 రోజుల పాటు అన్నవితరణ

**మధిర, తెలంగాణ ముచ్చట్లు**

మధిర పట్టణంలోని లడక్ బజార్ అయ్యప్ప నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో జరుగుతున్న మండల పూజలు గురువారంతో ముగిశాయి. గత నెల 16 నుండి ప్రారంభమైన 17వ వార్షిక మండల పూజలు 41 రోజులపాటు విశేష పూజలతో జరిగాయి. నవంబర్ 27వ తేదీ నుండి డిసెంబర్ 4వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వామి ఆలయంలో శబరిమలై లోని సన్నిధానంలో అయ్యప్ప స్వామికి మండల పూజల్లో జరిగే విధంగా పూజా కార్యక్రమాలను మధిర లో వేంచేసి ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. మండల పూజలలో ప్రతిరోజు వేకువజామునే గణపతి హోమం, అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహంతో శివేలి ప్రదర్శన, అనంతరం స్వామివారికి 18 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించడం సాయంత్రం తిరిగి శివేలి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఉత్సవాలలో పల్లి వేట, స్వామివారికి ఆరట్టు నదీ స్నానం ( చక్రస్నానం ) కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా కార్తీకమాసం ప్రారంభం నుండి మాలదారులకు నిర్వహిస్తున్న అన్నదానం 55 రోజులపాటు కొనసాగింది. మండల పూజలు చివరి రోజున ఆలయ కమిటీ నిర్వహణకులు భక్తులకు సేవ పురస్కారాలను అందజేశారు మండల పూజలలో స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను కేరళ అర్చకులు శబరి దినేష్ అర్చకులు దేవంభట్ల కుమారస్వామి మధుస్వామిలచే నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారావు గురు స్వాములు వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు, చెరుపల్లి శ్రీధర్, గాంధీ, కుందా పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# మన్మోహన్ మృతి పట్ల ప్రపంచ దేశాల సంతాపం

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రపంచ దేశాలు తమ సంతాపాన్ని ప్రకటించాయి. అమెరికా, రష్యా సహా భారత్ పొరుగు దేశాధినేతలందరూ మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారతదేశానికి మన్మోహన్ సింగ్ చేసిన సేవలను, ఆయనకు ఆయా దేశాలతో ఉన్న స్నేహపూర్వక సంబంధాలను గుర్తుచేసుకున్నారు.

**గొప్ప ఛాంపియన్‌ని కోల్పోయాం**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల అమెరికా సంతాపం ప్రకటించింది. భారతదేశ ప్రజలకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. భారత్‌అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య గొప్ప ఛాంపియన్లలో మన్మోహన్ ఒకరని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకన్ కొనియాడారు. గత రెండు దశాబ్దాల్లో భారత్‌అమెరికా కలిసి సాధించిన ఘనకార్యాల్లో చాలా వాటికి మన్మోహన్ సింగ్ పునాది వేశారని అన్నారు. భారత్‌అమెరికా మధ్య పౌర అణు సహకార ఒప్పందం ముందుకు తీసుకెళ్లడానికి మన్మోహన్ నాయకత్వమే దోహదం చేసిందని తెలిపారు. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు, వేగవంతమైన ఆర్థిక వృద్ధిని





ప్రోత్సహించిన నేతగా మన్మోహన్‌ను గుర్తుంచుకుంటారని అన్నారు. భారత్‌అమెరికా మధ్య సంబంధాల బలోపేతానికి మన్మోహన్ సింగ్ చేసిన కృషి, అంకిత భావాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామని బ్లింకన్ పేర్కొన్నారు.

**మంచి మిత్రుడిని కోల్పోయా**

ఆఫ్ఘానిస్థాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్ భారత్ తన అత్యంత ప్రసిద్ధమైన కుమారుల్లో ఒకరిని కోల్పోయిందని అన్నారు. మన్మోహన్ సింగ్ అఫ్గాన్ ప్రజలకు తిరుగులేని మంచి మిత్రుడని కొనియాడారు.

**తండ్రి లాంటి వారు**

మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్, మన్మోహన్ సింగ్ తనకు తండ్రి వంటి వారని పేర్కొన్నారు.

**తీరని లోటు**

మన్మోహన్ సింగ్ మృతి చెందడం భారత్, రష్యాలకు తీరని లోటు అని ఇండియాలోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ అన్నారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. అస్వస్థతతో గురువారం సాయంత్రం దిల్లీ ఎయిమ్స్‌లో చేరిన ఆయనకు అత్యవసర విభాగంలో చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. దీనితో మన్మోహన్ సింగ్ మృతి పట్ల ప్రపంచదేశాలు తమ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాయి.



## నో చెప్పులు, కొరడా దెబ్బలు, ఉపవాస దీక్షలు

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
తమిళనాట మరోసారి శపథ రాజకీయాలు మొదలయ్యాయా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై చర్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. డీఎంకేను గద్దె దించే వరకు శపథం చేసిన ఆయన, ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించనని గురువారం తెలిపారు. తాజాగా ఆరు కొరడా దెబ్బలు భరించి మురుగన్‌కు మొక్కు చెల్లించుకున్నారు.

**అసలు ఏం జరుగుతోందంటే?**

చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో ఓ విద్యార్థినిపై అత్యాచార ఘటన రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తమిళనాడులో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో అన్నామలై డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు.
"డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలు దర్శించుకునేందుకు 48 గంటల పాటు ఉపవాస దీక్ష చేపడతాను. కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటాను" అని అన్నామలై గురువారం తెలిపారు.

**చెప్పినట్లే ఆరు కొరడా దెబ్బలు**

ఆ మాట ప్రకారమే శుక్రవారం కోయంబత్తూర్‌లోని తన ఇంటి వద్ద బీజేపీ మద్దతుదారులు, మీడియా సమక్షంలో మొక్కు చెల్లించుకున్నారు. ఆరు కొరడా దెబ్బలు భరించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న బీజేపీ కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. లైంగిక వేధింపుల ఘటనను ఖండిస్తూ నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. స్టాలిన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.
"కొరడా దెబ్బలు భరించడం మన సంస్కృతిలో భాగమే. ఇది ఎవరికీ వ్యతిరేకం కాదు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయానికి మాత్రమే వ్యతిరేకం. అన్నా యూనివర్శిటీలో వెలుగుచూసిన ఘటనపై చర్యలు తీసుకోవాలన్నదే మా లక్ష్యం. గతంలో ఎంతోమంది ఈ ప్రక్రియను అనుసరించారు. దేవుడికి మనల్ని మనం సమర్పించుకునే విధానమే ఇది" అని అన్నామలై తన చర్యను సమర్థించుకున్నారు.మరోవైపు అన్నా యూనివర్సిటీకి చెందిన బాధిత విద్యార్థిని ఫిర్యాదుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌ను లీక్ చేయడంపై అన్నామలై మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లేలా పోలీసు అధికారుల తీరు ఉందని విమర్శించారు. లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడుపై రౌడీషీట్ తెరవలేదని, డీఎంకేతో అతడికున్న సంబంధాలే అందుకు కారణమని ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు.



## ఎయిర్‌పోర్ట్‌లో బాంబు దాడి

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధానోమ్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. యెమెన్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం ఎక్కేందుకు వేచి ఉండగా వైమానిక బాంబు దాడి జరిగింది. సనాలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఆ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని ఐక్యరాజ్యసమితి ఖండించింది. "ఐక్యరాజ్యసమితికి చెందిన ఉద్యోగులతో కలిసి ఖైదీల విడుదలపై చర్చలు, యెమెన్‌లో ఆరోగ్యం, మానవతా పరిస్థితులను అంచనా వేసేందుకు అక్కడికి వెళ్లాం. ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని మేము పిలుపునిచ్చాం. సనాలో విమానం ఎక్కేందుకు వేచిఉండగా బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో ఇద్దరు మృతి చెందినట్లు సమాచారం. విమానంలోని ఓ సిబ్బంది గాయాలపాలయ్యారు. ఘటన జరిగిన ప్రాంతానికి, మాకు కొన్ని మీటర్ల దూరం మాత్రమే ఉంది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సంతాపం తెలియచేస్తున్నాం" అని అధానోమ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**వైమానిక దాడులు ఆందోళనకరం**

ఈ దాడిని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఎక్స్ వేదికగా ఖండించారు. "ఇటీవల యెమెన్, ఇజ్రాయెల్‌ల మధ్య దాడులు తీవ్రతరం అయ్యాయి. సనా అంతర్జాతీయ విమానాశ్రయంతో సహా ఎర్రసముద్రం, ఓడరేవులు, యెమెన్‌లో పవర్ స్టేషన్‌లపై వైమానిక దాడులు ఆందోళనకరంగా ఉన్నాయి" అని పేర్కొన్నారు. ఈసందర్భంగా అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలన్నారు. పౌరులు, మానవతా కార్మికులే లక్ష్యంగా దాడులు చేయకూడదన్నారు. యెమెన్‌లోని సనా విమానాశ్రయం, ఇతర నౌకాశ్రయాలపై, పలు విద్యుత్కేంద్రాలపై గురువారం ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. హమాస్, హెజ్‌బొల్లా, సిరియాలోని అసద్ ప్రభుత్వాలు ఏం నేర్చుకున్నారో, త్వరలో హూతీలు అదే నేర్చుకుంటారని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యలు చేసిన మరుసటిరోజే ఈ దాడులు జరగడం గమనార్హం. గత కొన్ని రోజులుగా హూతీలు.. ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో కొంతమంది ఇజ్రాయెలీ పౌరులకు కూడా గాయాలయ్యాయి. ఈనేపథ్యంలో హూతీలను టెల్అవీవ్ లక్ష్యంగా చేసుకుంది. తాజా దాడులను ఇతర సైనికాధికారులతో కలిసి నెతన్యాహు పర్యవేక్షించినట్లు ఇజ్రాయెల్ ప్రభుత్వం తెలిపింది.



## ఈఎంఐ డబ్బులు చెల్లించలేదని సోదరుడికి యువతి న్యూడ్ ఫొటోలు

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
ఈఎం డబ్బులు కట్టలేదని ఓ యువతి న్యూడ్ ఫొటోలను కుటుంబ సభ్యులకు షేర్ చేసిన ఇద్దరు రికవరీ ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో జరిగింది. అంతకుముందు యువతి బంధువులు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి లోన్ డబ్బులు చెల్లించలేదని దుర్భాషలాడారని పోలీసులు తెలిపారు. యువతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మీడియాకు వెల్లడించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన యువతి హైదరాబాద్ నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్ చేస్తోంది. ఆరు నెలల కిందట ఆమె ఫినబుల్ అనే లోన్ యాప్‌లో ఈఎంఐ పద్ధతిలో లోన్ తీసుకుంది. సమయానికి ఆమె ఈఎంఐ చెల్లించలేదు. దీంతో డబ్బులు చెల్లించకపోతే యువతి ఫొటోలను అసభ్యకరంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తామని రికవరీ ఏజెంట్లు ఆమెను బెదిరించారు. అంతే కాకుండా బాధితురాలి తల్లిదండ్రులు, బంధువులను కూడా ఫోన్ చేసి డబ్బులు కట్టలేదని నోటికి వచ్చినట్లు దూషించారు.అయినా సరే అంతటితో ఆగకుండా రికవరీ ఏజెంట్లు ఆమె సోదరుడికి కొన్ని న్యూడ్ ఫొటోలను కూడా పంపించారు. వారి వేధింపులు తాళలేక యువతి పోలీసులను ఆశ్రయించిందని జిల్లా ఎస్పీ తెలిపారు. వెంటనే స్పందించిన పోలీసులు ఇద్దరి నిందితులను అరెస్టు చేశారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు లోన్ తీసుకునే వారికి కొన్ని జాగ్రత్తలు చెప్పారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల వద్ద రుణాలు తీసుకునే సమయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఫినబుల్ లోన్ యాప్‌పై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



## అజర్‌బైజాన్ ఫ్లైట్ క్రాష్

- పక్షి ఢీకొట్టిందా? రష్యా క్షిపణి వల్ల కూలిందా?

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
కజకిస్థాన్‌లో ప్రయాణికుల విమానం కూలి 38 మంది చనిపోయిన దుర్ఘటన వెనుక, వేళ్లన్నీ రష్యా వైపే చూపిస్తున్నాయి. ఉక్రెయిన్ డ్రోన్లను అడ్డుకునే ప్రయత్నంలోనే రష్యా గగనతల వ్యవస్థ యాక్టివేట్ అయి విమానాన్ని కూల్చినట్లు తెలుస్తోంది. ఉద్దేశపూర్వకంగా రష్యా ఈ పని చేసినట్లు భావించడం లేదనీ, అయితే నిజాన్ని అంగీకరించాలని అజర్ బైజాన్ కోరుతున్నట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది. విచారణ పూర్తయ్యే వరకు తమపై ఇలాంటి ఆరోపణలు చేయవద్దని రష్యా స్పష్టంచేసింది.

**పక్షి ఢీకొట్టడం వల్ల కాదా?**

అజర్‌బైజాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ప్రయాణికుల విమానం కూలి 38 మంది మృతి చెందడంపై పలు ఊహాగానాలు జరుగుతున్నాయి. ఓ పక్షి లేదా పక్షుల గుంపును ఢీకొట్టడం వల్ల, విమానంలో సాంకేతిక సమస్య తలెత్తిందని రష్యా విమానయాన శాఖ ప్రకటించింది. కానీ విమానంపై కాల్పుల గుర్తులు కనిపించడం అనుమానాలకు తావిచ్చింది. ఇప్పుడు అదే నిజమయ్యేలా కనిపిస్తోంది.

**కారణం ఇదే!**

కజకిస్థాన్‌లో విమానం కూలిన అక్టావ్ నగర ప్రాంతంలో కొన్ని రోజులుగా రష్యా గగనతల రక్షణ వ్యవస్థ గస్తీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ముఖ్యంగా ఉక్రెయిన్ డ్రోన్లు తమ దేశంలోకి రాకుండా అడ్డుకుంటోంది. ఇందులో భాగంగా ప్రయాణికుల విమానాన్ని కూడా డ్రోన్‌గా పొరబడి, ఆటోమేటిక్‌గా పాంట్సిర్ఎస్ అనే స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థ యాక్టివేట్ అయి విమానాన్ని కూల్చినట్లు సాంకేతిక అవగాహన ఉన్న కొన్ని సంస్థలు తెలిపాయి. ఆ విమానంలో సిగ్నల్ జామింగ్ జరిగినట్లు అంతకు ముందు ఫ్లైట్ రాడార్ సంస్థ కూడా ధ్రువీకరించింది. అయితే రష్యా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేయలేదని స్పష్టమవుతోందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. ఐతే ఈ దుర్ఘటన జరిగింది తమ వల్లే అని రష్యా అంగీకరించాలని అజర్ బైజాన్ కోరుతోంది.

**అనవసర ఊహాగానాలు వద్దు!**

విమాన ప్రమాద ఘటనపై అజర్‌బైజాన్ చేస్తున్న విచారణ కూడా రష్యన్ గగనతల రక్షణ వ్యవస్థే దుర్ఘటనకు కారణమని ధ్రువీకరించిందని సమాచారం. ఘటనపై స్పందించిన రష్యా, విచారణ పూర్తయ్యే వరకు ఇలాంటి ఊహాగానాలు చేయడం సరికాదని పేర్కొంది. రష్యా వల్లే ప్రమాదం జరిగిందని ఇప్పుడే ధ్రువీకరించలేమనీ, అలాగని ఈ విషయాన్ని కొట్టిపారేయలేమని కూడా కజకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఘటనకు గల కారణాలపై పారదర్శక విచారణకు పూర్తిగా సహకరించాలని కెనడా సహా పలు దేశాలు రష్యాను కోరాయి.

**38 మంది మృతి**

బుధవారం అజర్ బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని చెచెన్యాకు వెళుతున్న విమానం కజకిస్థాన్‌లోని అక్టౌ నగరానికి సమీపంలో కూలింది. పొగమంచు కారణంగా అది కజకిస్థాన్‌కు దారి మళ్లిందని, ఈ క్రమంలోనే పక్షుల గుంపును ఢీకొట్టడంతో సాంకేతిక సమస్య తలెత్తి అది కూలిందని తొలుత వార్తలు వచ్చాయి. ఆ ఘటన జరిగిన సమయంలో విమానంలో 67 మంది ఉండగా, 38 మంది చనిపోయారు.

## మన్మోహన్ మృతిపట్ల సీడబ్ల్యూసీ సంతాపం

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
మన్మోహన్‌సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు దిల్లీలోని పార్టీ సీడబ్ల్యూసీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైన సీడబ్ల్యూసీ సభ్యులు సంతాప తీర్మానాన్ని ఆమోదించారు. ఇందులో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ఇతర ముఖ్యనేతలంతా పాల్గొన్నారు. దేశానికి మన్మోహన్ చేసిన సేవలను తీర్మానంలో కొనియాడిన సీడబ్ల్యూసీ ఆయన ఘనమైన వారసత్వాన్ని కొనసాగించాలని పేర్కొంది. దేశం నిజమైన రాజనీతిజ్ఞుడ్ని కోల్పోయిందని సంతాపం తెలిపిన నేతలు మన్మోహన్ కృషి, పట్టుదలతో దేశ తలరాతను తీర్చిదిద్దారని కొనియాడారు. మన్మోహన్ తన జీవితంలో పాటించిన విలువలు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. గొప్ప ఆర్థికవేత్తగా, మానవతావాదిగా దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కాంగ్రెస్ నేతలు కీర్తించారు. మన్మోహన్ మంచి మిత్రుడు, దార్శనికుడు, మార్గదర్శి అని సోనియాగాంధీ



గుర్తుచేసుకున్నారు. మన్మోహన్‌ను గుర్తుచేసుకొని దేశ ప్రజలు ఎప్పటికీ గర్వపడతారని ఆమె పేర్కొన్నారు.
మరోవైపు, మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు దిల్లీలోని నిగంబోధ్ ఘాట్‌లో శనివారం ఉదయం 11.45 గంటలకు జరగనున్నట్లు కేంద్ర హోం శాఖ వెల్లడించింది.





## ఆర్థిక సంస్కర్తకు తెలంగాణ సమాజం నివాళి

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థీవదేహానికి ముఖ్యమంత్రి నివాళి అర్పించారు. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం బెళగావి వెళ్లిన సీఎం, మాజీ ప్రధాని మరణవార్త తెలియగానే అక్కడి నుంచి నేరుగా దిల్లీ వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. దేశం కోసం నిష్కళంకమైన, సమగ్రమైన నిర్ణయాలు తీసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. రాజకీయ, ప్రజా జీవితంలో మన్మోహన్ సింగ్ లెజెండ్‌గా ఉన్నారని సీఎం కీర్తించారు. దేశాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర అనన్యంగా కీర్తించారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంతాపం తెలిపారు. ముఖ్యమంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ సహా రాష్ట్రానికి చెందిన పలువురు ఎంపీలు ఉన్నారు. శనివారం నాటి అంత్యక్రియల్లో కొందరు నేతలు పాల్గొనను న్నారు.
మాజీ ప్రధాన మన్మోహన్ మృతిపట్ల శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాపం తెలిపారు. దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని శ్లాఘించారు. మన్మోహన్ మరణం దేశానికి, కాంగ్రెస్‌కి తీరని లోటని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో నివాళి అర్పించారు. దేశ విత్త వ్యవస్థను ఆర్థిక సంస్కరణలతో పరుగులు పెట్టించడమే కాక అనేక చారిత్రక చట్టాలను తెచ్చిన ఘనత మన్మోహన్‌కే దక్కుతుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు.

**వారం పాటు అన్ని పార్టీకి చెందిన కార్యక్రమాలు రద్దు :** మాజీ ప్రధాని మృతితో వారంపాటు పార్టీకి చెందిన అన్ని కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు పీసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. శనివారం నాటి కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాలతోపాటు జనవరి 3వ తేదీ వరకు అన్ని రాజకీయ కార్యక్రమాలు రద్దు చేసినట్లు మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు.

**కేసీఆర్ నివాళి :** మన్మోహన్ సింగ్ తో తనకున్న అనుబంధాన్ని మాజీ సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆర్థిక సంస్కరణల అమలులో తన విద్వత్తును ప్రదర్శించారంటూ కీర్తించారు. మన్మోహన్ సింగ్ హయాంలోనే రాష్ట్ర ఏర్పాటు జరగడం చారిత్రక సందర్భంగా కొనియాడారు. మన్మోహన్ మృతిపట్ల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంతాపం తెలిపారు. మన్మోహన్ అంత్యక్రియలకు కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎంపీలు హాజరుకానున్నారని గులాబీ పార్టీ వర్గాలు వెల్లడించాయి..

**బీజేపీ కార్యక్రమాలు వాయిదా:** మాజీ ప్రధాని మృతి పట్ల బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాప సూచకంగా పార్టీ కార్యక్రమాలు వాయిదా వేశామని తెలిపారు. జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఘన నివాళులర్పించారు. పార్టీ కార్యాలయాలు, పట్టణాల చౌరస్తాల్లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.



## కొత్తగా 'న్యూ ఇయర్ శుభాకాంక్షలు' చెప్పాలా అంటూ మెసెజ్‌లు వస్తున్నాయా అయితే జాగ్రత్త

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**
ఇంకో నాలుగు రోజుల్లో నూతన ఏడాదిలోకి అడుగు పెట్టబోతున్నాం. డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల నుంచే స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరికీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతాం. ఇప్పుడు ఈ కొత్త సంవత్సర వేడుకలను సైబర్ నేరగాళ్లు వారికి అనువుగా మార్చుకోవాలని చూస్తున్నారు. ఇదే తడవుగా దోచుకునేందుకు పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నూతన సంవత్సవ శుభాకాంక్షలను సాధారణంగా కాకుండా రకరకాల చిత్రాలు, సందేశాలను మీ పేరుతో సహా తయారు చేసుకొని పంపవచ్చని చెబుతూ, వీటి కోసం ఈ కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేసి, మీ వివరాలు నమోదు చేస్తే చాలని సెల్ ఫోన్‌లకు సందేశాలు వస్తున్నాయి. ఇప్పుడు మీరు ఆ లింక్‌పై పొరపాటున క్లిక్ చేశారో ఇక మీపని గోవిందా.సైబర్ దొంగలు ఇలా ప్రతి పండగను, సందర్భాన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రస్తుతం ఈ న్యూ ఇయర్ సెలబ్రెషన్స్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలకు ప్రత్యేకం అంటూ ఉన్నదంతా దోచుకునేందుకు సిద్ధమవుతున్నారు. స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్ ఉన్నవాళ్లు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా సరే వారి చేతికి చిక్కుతారు. తర్వాత మీ రహస్య సమాచారం అంతా సైబర్ కేటుగాళ్లకు చేరి వారి చేతిలో కీలుబొమ్మలు అవుతారు.
సెల్‌ఫోన్‌లో ఉన్న రహస్య సమాచారం అకౌంట్ వివరాలు, వ్యక్తిగత సమాచారం, ఖాతాలలోని డబ్బులు సైబర్ కేటుగాళ్లు కాజేస్తారని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అందుకే తెలియని నంబరు నుంచి న్యూ ఇయర్ శుభాకాంక్షలు భిన్నంగా చెప్పాలనుకుంటే మెసెజ్ లోపల లింక్ క్లిక్ చేయమంటారని, అలా ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సైబర్ పోలీసులు జాగ్రత్తలు చెబుతున్నారు. ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ ఫైల్స్ రూపంలో మెసెజ్‌లు వస్తాయని హెచ్చరిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
www.telanganamuchatlu.in





## ఆల్ టైమ్ రికార్డుల్లో దూసుకెళ్తున్న పుష్ప రాజ్..

పుష్ప 2 సక్సెస్ తో సౌత్ సినిమాల స్థాయి మరో లెవెల్ కు వెళ్లింది. టాక్ బాగుంటే స్టార్ హీరోల సినిమాలకు కలెక్షన్లు ఏ రేంజ్ లో ఉంటాయో బన్నీ ఋజువు చేశాడు. సుకుమార్ దర్శకత్వం వహించిన "పుష్ప 2: ది రూల్" సినిమా దేశ వ్యాప్తంగా ఓ సెన్సేషన్‌గా నిలిచింది. ఈ సినిమా కేవలం పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా అద్భుత విజయాన్ని సాధించింది.

ఇప్పటి వరకు విడుదలైన అన్ని సినిమాలకు భిన్నంగా ఉన్న కథనంతో, అల్లు అర్జున్ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో పుష్ప 2 కలెక్షన్లలో ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన 22 రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1700 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి ఆల్ టైమ్ రికార్డుల్లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది. పుష్ప 2 రికార్డు స్థాయి కలెక్షన్లు టాలీవుడ్‌కు గర్వకారణంగా నిలిచాయి.ఇక నార్త్ ఇండియాలో కూడా పుష్ప 2 సృష్టించిన సునామీకి తోడు హిందీ బెల్ట్‌లో మొదటి వారమే రూ. 400 కోట్ల పైగా వసూళ్లు సాధించడం ఒక చరిత్ర. ఇప్పటికే లెక్క అక్కడ 700 కోట్లు దాటింది. ఇక నైజాం, సీడెడ్, ఆంధ్రా ప్రాంతాల్లోనూ ఈ చిత్రం భారీ వసూళ్లను నమోదు చేసి, స్థానిక మార్కెట్‌లో నయా ట్రెండ్ సెట్ చేసింది. ప్రస్తుతం ఆల్ టైమ్ అత్యధిక వసూళ్ల జాబితాలో పుష్ప 2 మూడో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో మొదటి స్థానంలో అమీర్ ఖాన్ నటించిన "దంగల్" ఉంది, ఇది వరల్డ్ వైడ్ గా రూ. 2000 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. తరువాతి స్థానంలో "బాహుబలి 2: ది కన్‌క్లూజన్" ఉంది, ఇది రూ. 1810 కోట్ల వసూళ్లను అందుకుంది. కానీ పుష్ప 2 సునామీ కొనసాగుతుండడంతో బాహుబలి 2 రికార్డును కూడా త్వరలోనే పుష్ప 2 బ్రేక్ చేయగలదని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## కొత్త ఇన్నింగ్స్ కోసమేనా సీనియర్ నటి పాట్లు?



అల్లరి నరేష్ సరసన సిద్దు ఫ్రం శ్రీకాకుళం, శుభప్రదం చిత్రాల్లో నటించింది మంజరి ఫడ్నీస్. కానీ ఈ భామకు ఆశించినంత పెద్ద కెరీర్ సౌత్‌లో దక్కలేదనే చెప్పాలి. అందం, ప్రతిభ ఉన్నా కానీ పోటీలో నిలదొక్కుకోలేకపోయింది. ఆ తర్వాత మంజరి బాలీవుడ్ లోను నటించింది. తమిళం, మలయాళం, మరాఠా భాషల్లోను ఒక్కో సినిమా చేసింది. కానీ ఏ పరిశ్రమలోను నిలదొక్కుకోలేకపోయింది.ఇదిలా ఉంటే మంజరి ఫడ్నీస్ కి తన కెరీర్ లో 2024 కీలక సంవత్సరంగా మారింది. ఈ ఏడాది వరుసగా సినిమాలు, వెబ్ సిరీస్ లతో బిజీ అయింది. పూణే హైవే, పెంట్‌హౌస్ వంటి చిత్రాలలోను ఈ బ్యూటీ నటించింది. ఇటీవలే ఒక కొత్త కారును కూడా కొనుగోలు చేసానని తెలిపింది. 2025లో తన నటన, గానంలోను కెరీర్‌లను సమతుల్యం చేసుకోవడానికి ఎదురుచూస్తోంది.చాలా ఆత్మపరిశీలన తర్వాత నన్ను నేను మళ్లీ ఆవిష్కరించుకున్న సంవత్సరం ఇది అని మంజరి తెలిపింది. నా సిస్టమ్‌ను రీవైరింగ్ చేయడం వల్ల చాలా అద్భుతమైన విషయాలు జరిగాయి... గత 2 సంవత్సరాలుగా ఎన్నో ఉత్సవాల్లో విపరీతమైన ప్రేమను పొందుతున్న నా చిత్రం `చల్తీ రహే జిందగీ` ఈ సంవత్సరం ఎట్టకేలకు విడుదలైంది. విమర్శకుల ప్రశంసలతో పాటు, ప్రేక్షకుల ప్రేమను పొందింది. అలాగే నేను నా ఒకటవ సింగిల్ విడుదల చేయడంతో సంగీత పరిశ్రమలో నా ప్రయాణాన్ని ప్రారంభించాను. నేను చిన్నప్పటి నుంచి ఆరాధించే మీనాక్షి శేషాద్రి మేడమ్‌తో కలిసి పని చేస్తున్నాను. 2024లో ఫెమినా మహారాష్ట్ర అచీవర్ పురస్కారాన్ని గెలుచుకోవడం ఆనందాన్నిచ్చింది. నా సినిమా `పూణే హైవేని 2` కొన్ని వారాల క్రితం గోవాలో ప్రదర్శించాం. ఇంకా సంవత్సరం చివరి వరకు ఎదురుచూడాలి. . అని తెలిపింది.

# sports స్పోర్ట్స్



## కోహ్లీని అవమానించిన .. ఆస్ట్రేలియా అభిమానులు..

ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగో టెస్టులో విరాట్ కోహ్లీ ని ఆసీస్ అభిమానులు అవమానించారు. రెండో రోజు ఆటలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోహ్లీ (36; 86 బంతుల్లో 4 ఫోర్లు) క్రీజులో ఉన్నంతసేపు ఏకాగ్రతతో బ్యాటింగ్ చేశాడు. ఆరంభంలో ఆఫ్‌సైడ్ బంతులను వదిలేసి 'క్రమశిక్షణ' పాటించినట్లు కనిపించగా.. చివరకు మరోసారి అదే బలహీనతను బయటపెడుతూ పెవిలియన్ బాటపట్టాడు. బోలాండ్ వేసిన ఆఫ్ సైడ్ బంతిని కదిలించి వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. యశస్వి జైస్వాల్ (82)తో కలిసి కోహ్లీ మూడో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే, జైస్వాల్ రనౌట్‌కాగానే సహనం కోల్పోయి ఔట్‌సైడ్ ఆఫ్‌స్టంప్ బంతిని ఆడి వికెట్‌కీపర్‌కు చిక్కాడు. ఔటైన అనంతరం డ్రెస్సింగ్ రూమ్ వైపు వెళ్తున్న కోహ్లీని కొంతమంది ఆసీస్ ఫ్యాన్స్ ఎగతాళి చేశారు. తమ మాటలు, చేతలతో కోహ్లీని రెచ్చగొట్టారు. ఆసీస్ అభిమానుల కామెంట్స్‌తో తీవ్ర ఆగ్రహానికి గురైన విరాట్ వెనక్కి వచ్చి వారిపైపు సీరియస్‌గా చూశాడు. దీన్ని గమనించిన భద్రతా అధికారి కోహ్లీకి నచ్చజెప్పి లోపలికి తీసుకెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కోహ్లీ పట్ల ఆసీస్ అభిమానులు ప్రవర్తించిన తీరును భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా సతీమణి సంజనా గణేశన్ ఖండించారు. దేశంలోని అత్యుత్తమ బ్యాటర్ పట్ల ఇది అమర్యాదకరమైన ప్రవర్తన అని పేర్కొన్నారు. ఆటగాళ్లపై విమర్శలు చేయొచ్చు కానీ.. అది హద్దులు దాటుతోందని ట్విటర్ (ఎక్స్) వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక, మ్యాచ్ విషయానికొస్తే రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 164/5 స్కోరుతో ఉంది. రిషభ్ పంత్ (6*), రవీంద్ర జడేజా (4*) క్రీజులో ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. టీమ్ఇండియా ఇంకా 310 పరుగుల వెనకంజలో ఉంది. ఫాలో ఆన్‌ను తప్పించుకోవాలంటే మరో 111 పరుగులు చేయాలి.



## క్రికెట్ ఫ్యాన్స్ కు షాకింగ్ న్యూస్.. రోహిత్ శర్మ రిటైర్మెంట్?

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ప్రస్తుతం ఫామ్ కోసం తెగ తంటాలు పడుతున్నాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఆయన బ్యాట్ నుంచి ఒక గొప్ప ఇన్నింగ్స్ కూడా రాలేదు. చివరి 13 టెస్ట్ ఇన్సింగ్స్‌లలో చూసుకుంటే అతని నుంచి ఒక్కటే హాఫ్ సెంచరీ ఉండటం గమనార్హం. అటు ఆసీస్ టూర్‌లో హిట్ మ్యాన్ వరుసగా విఫలం అవుతూ వచ్చాడు. మిడిల్ ఆర్డర్‌లోనూ గత రెండు మ్యాచుల్లో ఆడలేకపోయాడు. నాలుగో టెస్టులో ఓపెనర్‌గానూ ఫెయిల్ అయ్యాడు. ఇక తొలి ఇన్నింగ్స్‌లో అయితే కేవలం 3 పరుగులకే ఔట్ అయ్యాడు. బ్యాట్స్ మెన్ గానే కాదు అటు కెప్టెన్ గా కూడా రోహిత్ వ్యూహాలు విఫలమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హిట్ మ్యాన్ ఆటతీరుపై మాజీల నుంచో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఇక ఇప్పుడు నెటిజన్స్ కూడా రోహిత్ ఆట తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. రోహిత్ రిటైర్మెంట్ ఇవ్వాలని, ఆయన స్థానంలో యంగ్ ప్లేయర్‌స్‌కు ఛాన్స్ ఇవ్వాలంటూ నెట్టింట వరుస ట్వీట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆసీస్ సిరీస్ తర్వాత రోహిత్ శర్మ రిటైర్మెంట్ ఇస్తాడంటూ ప్రచారం జరుగుతోంది.ప్రస్తుతం ఫామ్ లో లేని రోహిత్ శర్మ ను తీసేయాలనే డిమాండ్స్ ఎక్కువవుతున్న నేపథ్యంలో కెప్టెన్సీని బుమ్రాకు లేదా ఇతర ప్లేయర్‌కు అప్పగించడం ఉత్తమమనే సూచనలూ వస్తున్నాయి. ఈక్రమంలో సిడ్నీ వేదికగా జనవరి 3 నుంచి ఆసీస్‌తో ఐదో టెస్టు జరగనుంది. ఈ టెస్ట్ లో అయినా హిట్ మ్యాన్ బాగా ఆడి ఫేమ్ లోకి వస్తే బాగుటుందని క్రికెట్ ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in